



హనుమాన్ జంక్షన్ వద్ద మంత్రి లోకేశ్ అభివాదం (ఇన్‌సెట్‌లో) అశోక్ లేలాండ్ ప్లాంట్‌లో వాహనాలను పరిశీలిస్తున్న లోకేశ్



మల్లవల్లికి కొత్త కళ

అశోక్ లేల్యాండ్ బస్ బాడీబిల్డింగ్ ప్లాంట్ ప్రారంభోత్సవంతో సందడి

- మంత్రి నారా లోకేశ్‌కు అడుగడుగునా నీరాజనం
- అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
- గజమాలతో టీడీపీ కార్యకర్తల స్వాగతం

హనుమాన్ జంక్షన్/హనుమాన్ జంక్షన్ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ఐటీ శాఖా మంత్రి, టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్‌కు బుధవారం హనుమాన్ జంక్షన్‌లో ఘనస్వాగతం లభించింది. మల్లవల్లిలోని ఏపీఐఐసీ ఇండస్ట్రియల్ పార్కులో హిందూజా గ్రూప్ అనుబంధ సంస్థ అశోక్ లేల్యాండ్ స్థాపించిన ఎలక్ట్రికల్, డీజిల్ బస్సు బాడీబిల్డింగ్ యూనిట్‌ను ఆయన ప్రారంభించారు. ముందుగా ఇండస్ట్రియల్ పార్కుకు రోడ్డు మార్గాన వెళ్తూ.. మార్గంమధ్యలో అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు. స్వామివారికి తమలపాకులతో పూజ నిర్వహించారు. మూలవిరాట్ విగ్రహానికి కూడా ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మల్లవల్లి ఇండస్ట్రియల్ పార్కుకు వెళ్లారు. ఏలూరు జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వీ పర్యవేక్షణలో ఆలయ ఈవో తారకేశ్వరరావు, అర్చకులు.. లోకేశ్‌కు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అంతకుముందు లోకేశ్‌ను భూగర్భ గనుల శాఖా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు మిగతా 6లో..

రాష్ట్రానికే గర్వకారణం

అశోక్ లేల్యాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా

మల్లవల్లి పారిశ్రామికవాడలో అశోక్ లేల్యాండ్ ప్లాంటును మంత్రి నారా లోకేశ్ ప్రారంభించి ఎంహెచ్ఆర్టీసీ (మహారాష్ట్ర) బస్సులను జెండా ఊపి ప్రారంభించారు. ప్రపంచస్థాయి నాణ్యతా ప్రమాణాలతో, అధునాతన సాంకేతికతతో ఎలక్ట్రికల్ బస్సుల తయారీకి అనువుగా ఈ యూనిట్‌ను రూపొందించారు. ఈ సందర్భంగా అశోక్ లేల్యాండ్ చైర్మన్ ధీరజ్ హిందూజా మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రగతిశీల పారిశ్రామిక విధానాన్ని రూపొందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు ముందుచూపు ప్రేరణతోనే ఆంధ్రప్రదేశ్‌లో తమ కార్యకలాపాలు ప్రారంభిస్తున్నామని, ఇందుకు చాలా సంతోషిస్తున్నామని చెప్పారు. అశోక్ లేల్యాండ్ సీఈవో మాట్లాడుతూ కొత్త ప్లాంటు ప్రారంభంతో అశోక్ లేలాండ్ బస్సు దేశంలోనే మొదటి స్థానాన్ని, ప్రపంచవ్యాప్తంగా 5వ స్థానాన్ని పటిష్టం చేసుకుందన్నారు. ఈ యూనిట్ ప్రారంభించిన మొదటి రోజు నుంచి 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో పనిచేయడం ప్రారంభిస్తోందన్నారు. కొత్త ప్లాంట్‌లో అత్యాధునిక పరికరాలు అధికస్థాయి ఆటోమేషన్‌తో అమర్చబడి ఉన్నాయని తెలిపారు. దీనివల్ల అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలతో ఉత్పత్తులను తయారు చేయవచ్చని ఆయన చెప్పారు.

తప్పతాగి.. దాష్టీకం

భక్తిభావంతో కొనసాగాల్సిన తిరుపతమ్మ తిరునాళ్లలో భయానక వాతావరణాన్ని సృష్టించారు. ఆధ్యాత్మికతకు ఆలవాలంగా జరగాల్సిన వేడుకల్లో వికృతచేష్టలతో రెచ్చిపోయారు. మందుకొట్టారు.. మత్తులో డ్యాన్సులు వేశారు.. డీజేలతో హోరెత్తించారు.. బైకులతో విన్యాసాలు చేశారు.. ఇతర పార్టీల వారిపై రాళ్లు రువ్వారు.. అడ్డొచ్చిన పోలీసులపై ప్రతాపం చూపారు. ప్రతిష్ఠాత్మకమైన తిరుపతమ్మ తిరునాళ్లలో మంగళవారం రాత్రి జరిగిన ఈ అవాంఛనీయ ఘటనలకు వైసీపీ అల్లరిమూకలే ప్రధాన కారణమని తెలుస్తోంది.

తిరుపతమ్మ తిరునాళ్లలో ఘర్షణకు వైసీపీ కార్యకర్తలే కారణం

ప్రభలు, డీజేలతో ఒకటే పాటల హోరు





అమ్మవారి పసుపు కుంకుమల వద్ద కిక్కిరిసిన భక్తులను అదుపు చేయలేక పోయిన పోలీసులు (ఇన్‌సెట్‌లో) వైసీపీ కార్యకర్తల దాడిలో గాయపడిన పోలీస్

- పూటుగా తాగి రోడ్ల వెంట అసభ్య నృత్యాలు
- ద్విచక్రవాహనాలతో ప్రమాదకర విన్యాసాలు
- టీడీపీ, జనసేన వాహనాలపైకి రాళ్లు
- అడ్డొచ్చిన పోలీసులపై కూడా దాడి
- వైసీపీ వికృతాలను ఆపలేకపోయిన పోలీసులు
- 16 మందికి రిమాండ్.. మచిలీపట్నం తరలింపు

జగ్గయ్యపేట రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : తిరుపతమ్మ తిరునాళ్లను పురస్కరించుకుని మంగళవారం రాత్రి పెనుగంచిప్రోలు వైసీపీ ఆధ్వర్యంలో భారీగా డీజే వాహనాలు ఏర్పాటు చేసుకున్నారు. జగ్గయ్యపేట రోడ్డులోని తంభరేణి ఫంక్షన్ హాల్ నుంచి ఆలయం వరకు ర్యాలీగా బయల్దేరిన ఆ పార్టీ కార్యకర్తలు పెనుగంచిప్రోలు గ్రామంలో స్వైరవిహారం చేశారు. రోడ్లపై నృత్యాలు, ద్విచక్ర వాహనాలతో విన్యాసాలు చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేశారు. వారి వికృతచేష్టలకు పిల్లలు, మహిళలు రోడ్లపైకి వచ్చేందుకు భయపడిపోయారు. డీజే వాహనాలు కిలోమీటర్ ప్రయాణించేందుకు సుమారు 7 గంటల సమయం పట్టింది. ఎట్టకేలకు రాత్రి 2 గంటల సమయంలో పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్ మిగతా 6లో..

జెయింట్ వీల్ అనుమతుల్లో అనుమానాలు



తిరునాళ్లలో యువకుడి మృతికి అధికారుల సమన్వయలోపమే కారణమన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లక్షల మంది హాజరయ్యే తిరునాళ్ల ప్రాంగణంలో భారీ జెయింట్ వీల్స్‌కు అనుమతినివ్వడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరునాళ్లలో ఈనెల 14 నుంచి 25వ తేదీ వరకు జెయింట్ వీల్స్‌ను తిప్పుకోవడానికి కాకాని శేషగిరిరావు అనే వ్యక్తి రూ.11 లక్షలకు వేలం దక్కించుకున్నాడు. జీఎస్టీ 18 శాతం కలిపి చెల్లించిన పాటదారుడు తన అనుమతులను మరొక వ్యక్తికి రూ.18 లక్షలకు అమ్ముకున్నట్లు సమాచారం. ఆ వ్యక్తి జెయింట్ వీల్స్‌తో పాటు క్రాస్ వీల్, ట్రైన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాడు. అతని వ్యాపారానికి పోలీస్, రెవెన్యూ, పంచాయతీ, దేవదాయ, విద్యుత్ శాఖలు అనుమతి ఇచ్చారు. పరికరాలకు పరీక్షలు నిర్వహించి అనుమతి ఇవ్వాల్సిన ఆర్అండ్‌బీ అధికారులు ఆ పని చేయలేదు. ఆర్అండ్‌బీ శాఖ ఒప్పుకోకపోయినా నిర్వాహకులు ఎలా ఏర్పాటుచేశారన్న ప్రశ్నలు కూడా ఉదయిస్తున్నాయి. ఇదిలా ఉండగా, ఆలయ అధికారులు లీజు వేలం నిర్వహించిన స్థలం మునేరు సబ్ డివిజన్ స్థలం. ఆలయానికి సమీపంలో ఖాళీగా ఉన్న ఈ స్థలంలో జెయింట్ వీల్ నిర్వహించేందుకు ఏకంగా ఆలయ అధికారులు వేలం నిర్వహించడం గమనార్హం. దీనిపై దేవదాయ శాఖ కమిషనర్ ఆలయ ఈవో కిషోర్‌ను నివేదిక కోరినట్లు తెలిసింది.



షాట్‌పుట్‌లో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్



టేబుల్ టెన్నిస్‌లో పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్‌రాజా



పరుగు పందెంలో గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

ఆట అదుర్స్

ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో జరుగుతున్న క్రీడా పోటీల్లో ప్రజాప్రతినిధులు ఉత్సాహంగా పాల్గొంటున్నారు. నిత్యం ప్రజా సమస్యలు, రాజకీయాల్లో తలమునకలై ఉండేవారు.. వాటన్నింటినీ పక్కనపెట్టి ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొంటున్నారు. బుధవారం జరిగిన పరుగు పందెం, త్రోబాల్, టెన్నిస్, క్రికెట్ పోటీల్లో ఉల్లాసంగా తలపడ్డారు.

ఏజేపై విచారణ

మచిలీపట్నంలోని ఆంధ్రా జాతీయ కళాశాల (ఏజే విద్యాపరిషత్) వివాదాల సుడిలో చిక్కుకుంది. వైసీపీ హయాంలో పరిషత్‌లో జరిగిన అక్రమాలు, అవినీతిపై వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం కాకినాడకు చెందిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పీవీఎల్ రమేశ్‌ను విచారణ అధికారిగా నియమించగా, బుధవారం ఆయన కళాశాలకు వచ్చి అన్ని వివరాలు సేకరించారు.

విచారణ అధికారిగా కాకినాడ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్

- మచిలీపట్నం వచ్చి విచారణ మొదలుపెట్టిన అధికారి
- పూర్తి వివరాలు అందించిన ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వందేళ్లకు పైబడి చరిత్ర ఉన్న ఆంధ్రా జాతీయ కళాశాల (ఏజే విద్యాపరిషత్)ను గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కోపల్లె హనుమంతరావు అనే వ్యక్తికి అప్పగించారు. గతంలో ఎయిడెడ్ సంస్థగా ఉన్న ఈ పరిషత్‌లో ఏజే కళాశాల, ఏజే బీఈడీ కళాశాల, సంస్కృత ఉన్నత పాఠశాల, ఏజేకే ఐటీఐలు ఉండేవి. కళాశాల, పాఠశాలలో పనిచేసే లెక్చరర్లు, టీచర్లు పదవీ విరమణ చేయడంతో మళ్లీ ఆ పోస్టులు భర్తీకాక పరిషత్ తన ఉనికిని కోల్పోయింది. దీంతో ఏజే విద్యాపరిషత్‌కు తానే వారసుడినని కోపల్లె హనుమంతరావు అనే వ్యక్తి వైసీపీ ప్రభుత్వ హయాంలో తెరపైకి వచ్చాడు. ఈ విద్యాసంస్థలకు, వాటికి సంబంధించిన పత్రాలను సృష్టించారు. దీంతో పరిషత్‌ను వైసీపీ ప్రభుత్వం ఆయనకు కట్టబెట్టేసింది.



విచారణ అధికారితో మాట్లాడుతున్న ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి నాయకులు

కాకినాడ దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ విచారణ

గత ఏడాది అక్టోబరు 2న మహాత్మాగాంధీ జయంతి, స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో పాల్గొనేందుకు మచిలీపట్నం వచ్చిన సీఎం చంద్రబాబు బహిరంగ సభలోనూ, ఏజే కళాశాల ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలోనూ ఈ కళాశాలను ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుని నడుపుతోందని ప్రకటించారు. దీంతో పట్టణ ప్రముఖులు ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితిని ఏర్పాటు చేశారు. మంత్రి కొల్లు రవీంద్ర చొరవతో ఈ విద్యాపరిషత్‌లోని విద్యాసంస్థలను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని మళ్లీ పునర్వైభవం తీసుకురావాలని సమితి నాయకులు కోరుతూ వస్తున్నారు. జనవరి, ఫిబ్రవరిలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దేవదాయ శాఖ కమిషనర్‌ను కలిసి ఏజే విద్యాపరిషత్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అంశంపై చర్చించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ కళాశాల వ్యవస్థాపకులతో సంబంధంలేని వ్యక్తికి అడ్డగోలుగా అప్పగించారు. ఈ విద్యాపరిషత్‌కు వందలాది ఎకరాల భూములు, వాటిపై వచ్చే ఆదాయానికి గండికొట్టి, తప్పుడు లెక్కలు చూపి ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టడంపై విచారణ చేయాలని కూడా వినతిపత్రాలు అందజేశారు. ఈ విషయంపై దేవదాయ శాఖ ఉన్నతాధికారులు విచారణ చేయకుండా జాప్యం చేస్తుండటంతో మంత్రి కొల్లు రవీంద్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ఎట్టకేలకు కాకినాడకు చెందిన దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ పీవీఎల్ రమేశ్‌ను ఈ అంశంపై విచారణ అధికారిగా నియమించారు. ఆయన బుధవారం కళాశాలకు వచ్చారు.

పలు అంశాలపై ఫిర్యాదు

విచారణ అధికారి పీవీఎల్ రమేశ్‌ను ఏజే విద్యాపరిషత్ పరిరక్షణ సమితి నాయకులు కొడాలి శర్మ, మిగతా 6లో..

గందరగోళం..!

పిల్లలకు ఆధార్ ఈకేవైసీ చేయకపోతే రేషన్ రానట్టే..!

వీఆర్వోలకు ఇచ్చిన జాబితాలన్నీ గజిబిజి

- సిరీస్ కోడ్‌లు లేకపోవటంతో వీఆర్వోల్లో తికమక
- డీలర్లకు అప్పగించాలని చేతులెత్తేస్తున్న వైనం
- తమకు తెలియదని తప్పించుకుంటున్న డీలర్లు



రెండు జిల్లాల్లో రేషన్‌కార్డుల ఈకేవైసీ అంశం గందరగోళంగా మారింది. ఈ విషయాన్ని పౌరసరఫరాల సంస్థ అధికారులు సీరియస్‌గా తీసుకోకపోవటంతో కార్డుల్లో పిల్లలకు సంబంధించి ఈకేవైసీ పూర్తిచేస్తేనే వచ్చేనెల నుంచి నిత్యావసరాల కోటా అందే అవకాశముంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సాధారణంగా రేషన్ కార్డుదారుల పిల్లలకు ఈకేవైసీ జరగకపోయినా ఇప్పటి వరకు నిత్యావసరాలు ఇస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈకేవైసీ జరగని వాటిని తక్షణమే చేయించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఈ సర్వే బాధ్యతలను గ్రామ సచివాలయాల్లో పనిచేసే రెవెన్యూ వీఆర్వోలపై మోపారు. వాస్తవానికి సివిల్ సప్లయిస్‌కే దీని బాధ్యతలు అప్పగిస్తే ఎలాంటి గందరగోళం లేకుండా ఈకేవైసీ పూర్తయ్యేది. అందుకు భిన్నంగా వీఆర్వోలకు అప్పగించడం వల్ల.. ఇప్పటికే పీ4 వంటి అనేక సర్వేలు, ఇతర విధుల్లో తలమునకలుగా ఉన్న సచివాలయ వీఆర్వోలు ఈకేవైసీ అంశాన్ని పక్కన పెట్టేశారు. ఫలితంగా మార్చి మూడోవారం పూర్తవుతున్నా ఈకేవైసీ పూర్తికాలేదు. కృష్ణాజిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు కనీసం అవగాహన అయినా కల్పిస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో అది కూడా జరగట్లేదు.

డేటాషీట్లతో వీఆర్వోల తికమక

వీఆర్వోలకు అందిన డేటాషీట్లు గందరగోళంగా ఉన్నాయి. డేటా ప్రకారం చూస్తే వారికి కార్డుదారులెవరో తెలియట్లేదు. దీనికి వైసీపీ ప్రభుత్వ హయాంలో మార్చిన రైస్‌కార్డులే కారణం. ఒకప్పుడు తెల్లకార్డులు డబ్ల్యుఏపీ కోడ్‌తో ప్రారంభమయ్యేవి. ఆ తర్వాత టీఏపీ సిరీస్‌తో కార్డులు వచ్చాయి. ఆ తర్వాత రచ్చబండలు నిర్వహించిన క్రమంలో ఆర్ఏపీ సిరీస్‌తో రేషన్ కార్డులు వచ్చాయి. అనంతరం వైఏపీ కార్డులు వచ్చాయి. ఈ కార్డులన్నీ ఒక సిరీస్‌తోనే ఉంటాయి. ఏ రాష్ట్రానికి, ఏ మండలానికి, ఏ డిపోకు చెందినవో వీటిద్వారా తెలిసేది. కొండంత జాబితాలు ఇచ్చినా కూడా చాలా తేలిగ్గా, మండలాలవారీగా, గ్రామాలవారీగా, డిపోలవారీగా విభజించుకునే అవకాశం ఉండేది. వైసీపీ ప్రభుత్వం వచ్చాక వీటన్నింటినీ రద్దుచేసి రైస్ కార్డులను మిగతా 6లో..

ఈకేవైసీ నమోదు తప్పనిసరి

ఇటీవలే పిల్లలు ఆధార్‌కార్డులు పొంది ఉంటే, ఇప్పటికీ ఈకేవైసీ చేయించుకోకుంటే వచ్చేనెల నుంచి రేషన్ బియ్యం పొందేందుకు వీలుండదని అధికారులు చెబుతున్నారు. ఈకేవైసీ కోసం సాఫ్ట్‌వేర్‌ను కూడా మారుస్తున్నారు. ఇప్పటికే ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారి వివరాలను ఆయా గ్రామ పంచాయతీల్లోని వీఆర్వోలకు అందజేశారు. అక్కడకు వెళ్లి, వివరాలు తెలియజేసి, తక్షణం పిల్లలకు ఈకేవైసీ చేయించుకోవాల్సిన అవసరం ఉంది.

పెడన హెడ్ కానిస్టేబుల్, కానిస్టేబుల్‌పై చర్యలు

టీడీపీ పెడన నేత సులేమాన్‌పై దాడి కేసులో..

పెడన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పెడన పోలీసు స్టేషన్‌కు చెందిన ఓ హెడ్ కానిస్టేబుల్, ఓ కానిస్టేబుల్‌ను వీఆర్‌కు పంపుతూ జిల్లా ఎస్పీ గంగాధరరావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. టీడీపీ పెడన మైనారిటీ సెల్ నాయకుడు సులేమాన్ దాదాపై జరిగిన దాడి ఘటనలో సరిగ్గా వ్యవహరించలేదన్న కారణంగా పెడన పోలీసుస్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న శంకర్, కానిస్టేబుల్ రఫీలను వీఆర్‌కు పంపారు.

ఎన్టీటీపీఎస్‌లో భారీ అగ్నిప్రమాదం

- స్టేజ్-1 బంకర్‌కు వెళ్లే కన్వేయర్ బెల్టుకు మంటలు
- 50మీ. బెల్టు దగ్ధం.. రూ.1.50 కోట్ల ఆస్తినష్టం



కన్వేయర్ బెల్టుకు అంటుకున్న మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

ఇబ్రహీంపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్టేజ్-1 బంకర్‌కు వెళ్లే కన్వేయర్ బెల్ట్‌కు బుధవారం మిగతా 6లో..

రంజాన్ వేళలు

ఇఫ్తార్ : 06-22 (గురువారం సాయంత్రం)

సహర్ : 04-52 (శుక్రవారం ఉదయం)

• నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం

పిచ్చుకలను కాపాడుకుందాం!

- ప్రమాదంలో పర్యావరణం.. భావితరాలను రక్షించుకుందాం
- పిచ్చుకలను పెంచుకుందాం..
- పక్షుల కోసం నీరు, ఆహారాన్ని అందిద్దాం

6లో



బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేయండి

- అధికారులతో సమీక్షలో కలెక్టర్ బాలాజీ
- నెలాఖరుకు మంత్రి కొల్లు రవీంద్రతో చర్చలు

6లో

నేడు ప్రపంచ పిచ్చుకల దినోత్సవం సందర్భంగా..

పిచ్చుకలను కాపాడుకుందాం!





- ప్రమాదంలో పర్యావరణం.. భావితరాలను రక్షించుకుందాం
- తగ్గిపోయిన పిచ్చుకలను పెంపొందించేద్దాం..
- పక్షుల కోసం నీరు, ఆహారాన్ని అందిద్దాం

(ఆంధ్రజ్యోతి, ఇబ్రహీంపట్నం)

పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకల పాత్ర ఎంతో కీలకమైనది. నేడు నగరీకరణతో వాటి సంఖ్య గణనీయంగా తగ్గిపోయి పర్యావరణం ప్రమాదకర స్థితిలో పడింది. పిచ్చుకలు తగ్గిపోవడానికి మానవ తప్పిదాలు అనేకం ఉన్నాయనే చెప్పాలి. ఒకప్పుడు పూరిళ్ల వసారాల్లో, గొడ్ల చావిడ్లలో పిచ్చుకలు గూళ్లు పెట్టుకునేవి. పంట పొలాల్లో బావుల దగ్గర పెద్ద ఎత్తున పిచ్చుక గూళ్లు కనిపించేవి. వరి, మొక్కజొన్న అపరాల కోతల సమయంలో పొలాల్లో గింజలు, కీటకాలను తిని బావుల వద్ద నీరు తాగి అక్కడే చెట్లకు గూళ్లు కట్టుకొని సంతానాన్ని ఉత్పత్తి చేసుకునేవి. కాలక్రమంలో బావులు స్థానంలో బోర్లు రావడం, వ్యవసాయ పంటల సాగులో గణనీయమైన మార్పుల కారణంగా పిచ్చుకల సంఖ్య బాగా పడిపోయింది. ముఖ్యంగా ఎక్కడపడితే అక్కడ ఏర్పాటు చేసే సెల్ టవర్ల నుంచి వచ్చే రేడియేషన్, వాతావరణ కాలుష్యం వల్ల పిచ్చుకల సంఖ్య భారీగా తగ్గిపోయింది. పిచ్చుకలను కాపాడుకోకుంటే భావితరాలకు వాటిని మ్యూజియంలోనే చూడాల్సిన పరిస్థితి వస్తుంది. పిచ్చుకల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

● ప్రతి సంవత్సరం మార్చి 20న ప్రపంచ పిచ్చుకల దినోత్సవం నిర్వహిస్తారు. పిచ్చుకల సంరక్షణ, వాటి ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే దీని ప్రధాన లక్ష్యం పర్యావరణ పరిరక్షణలో పిచ్చుకలు ఎలాంటి పాత్ర పోషిస్తాయో, కీటకాల నియంత్రణకు ఎలా దోహదం చేస్తాయో, విత్తన వ్యాప్తి, పుష్పాల పరాగ సంపర్కానికి ఎలా ఉపయోగపతాయో తెలియజేస్తూ.. పట్టణీకరణ, వ్యవసాయ యాంత్రీకరణ, మార్పులు, సెల్ టవర్స్, ఇతర కాలుష్యం వంటి కారణాల వల్ల పిచ్చుకల సంఖ్య గణనీయంగా తగ్గుతున్న విషయాన్ని.. పిచ్చుకల సంరక్షణకు సంబంధించిన విషయాలను ప్రజల దృష్టికి తీసుకురావడం, ఈరోజు ముఖ్య ఉద్దేశ్యం. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని ప్రతి ఏడాది మార్చి 20న ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. దీని వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశ్యం పిచ్చుకల సంరక్షణ, వాటి ఆవాసాల పరిరక్షణ, పర్యావరణ వ్యవస్థలో వాటి ప్రాముఖ్యత గురించి ప్రజల్లో అవగాహన పెంచడమే. ప్రపంచ పిచ్చుకల దినోత్సవాన్ని మొదటి సారిగా 2010లో నిర్వహించారు. ఇది 'నేచర్ ఫరెవర్ సొసైటీ (భారతదేశం) ఎకో-సిస్ యాక్షన్ ఫౌండేషన్ (ఫ్రాన్స్)ల సహకారంతో ప్రారంభించబడింది.




స్ఫూర్తి శ్రీనివాస్ వేసిన చిత్రాలు



● పిచ్చుకలు మానవులకు చాలా దగ్గరగా ఉండే పక్షులు.. అయినా ఇటీవల వాటి సంఖ్య గణనీయంగా తగ్గింది. దీనికి ప్రధాన కారణాలు.. పట్టణీకరణ వల్ల సహజ ఆవాసాల నాశనం, రసాయన ఎరువులు మరియు కీటకనాశకాల వాడకం, విద్యుత్ అస్కాంత వికిరణం (మొబైల్ టవర్లు) ప్రభావం, వాతావరణ మార్పులు, కాలుష్యం. పిచ్చుకలు పర్యావరణ వ్యవస్థలో కీలక పాత్ర పోషిస్తాయి.. కీటకాలను తినడం ద్వారా వాటి సంఖ్యను నియంత్రిస్తాయి. విత్తనాలను వ్యాప్తి చేయడంలో సహాయపడతాయి. పుష్పాల పరావరాగ సంపర్కానికి దోహదపడతాయి.

పిచ్చుకల సంరక్షణ చర్యలు

ప్రజలు పిచ్చుకలను రక్షించడానికి, వాటి ఆవాసాలను మెరుగుపరచడానికి చర్యలు తీసుకోవాలి. పిచ్చుకలకు సహజ ఆవాసాలను సృష్టించడం, నీటి పాత్రలు, ఆహారాన్ని అందించడం, రసాయన ఎరువులు, కీటకనాశకాల వాడకాన్ని తగ్గించడం. సెమినార్లు, వర్క్‌షాపులు, ప్రచార కార్యక్రమాల నిర్వహణ, పిచ్చుకల గూళ్లు, నీటి పాత్రలను ఏర్పాటు చేయడం.

మచ్చిక చేసుకుందాం..

» ఆకట్టుకుంటున్న స్ఫూర్తి శ్రీనివాస్ చిత్రాలు



బెంజిసర్కిల్ : పిచ్చుకలను మచ్చిక చేసుకుందామా నినాదంతో నగరానికి చెందిన చిత్రకారుడు స్ఫూర్తి శ్రీనివాస్ వేసిన చిత్రాలు ఆకట్టుకుంటున్నాయి. దశాబ్దకాలంగా ఆయన అంతరించిపోతున్న పిచ్చుకలను రక్షించావలనే భావనతో సుమారు వందకు పైగా చిత్రాలను వేసి ప్రదర్శిస్తున్నారు. ఆధునిక సమాజంలో ప్రకృతి వైపరిత్యాలు, ప్రపంచీకరణ, సాంకేతిక అడ్డంకులతో అంతరించిపోతున్న పిచ్చుకలపై ఆయన కళ్లకు కట్టినట్టు చిత్రాలు వేసి భావితరాలకు పిచ్చుకలను అందించాలనే ఉద్దేశ్యంతో అవగాహన కల్పిస్తున్నట్టు స్ఫూర్తి శ్రీనివాస్(పిచ్చుకల శ్రీనివాస్) తెలిపారు. పరిశోధకులకు బర్డ్‌హౌస్‌లను కూడా అందిస్తున్నట్టు పేర్కొన్నారు.



తాను గీసిన చిత్రంతో శ్రీనివాస్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేయండి

» కృష్ణా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మంగినపూడి బీచ్ ఫెస్టివల్‌కు ఏర్పాట్లు చేయాలని కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ చాంబర్‌లో బుధవారం జేసీ గీతాంజలిశర్మతో కలిసి వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. గతంలో బీచ్ ఫెస్టివల్‌ను ఎలా నిర్వహించారనే అంశంపై అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ నెలాఖరునాటికి బీచ్ ఫెస్టివల్‌పై మంత్రి కొల్లు రవీంద్రతో చర్చలు జరిపి, ఎన్ని రోజుల పాటు కార్యక్రమాన్ని నిర్వహించాలనే అంశంపై తుది నిర్ణయం తీసుకుని తేదీలను ఖరారు చేస్తామన్నారు. బీచ్ ఫెస్టివల్‌లో మ్యూజికల్ నైట్, ఫుడ్‌స్టాల్స్, జెయింట్‌వీల్, ఎగ్జిబిషన్, హెలీకాప్టర్ రైడింగ్, గుర్రపు స్వారీ, వాటర్ స్పోర్ట్స్, 100అడుగుల దోస, బీచ్ కబడ్డీ, పారిశుద్ధ్య చర్యలు తదితరాలను ఏర్పాటు చేసేందుకు అయ్యే ఖర్చులను నివేదిక తయారుచేసి అందజేయాలని అధికారులకు సూచించారు. పర్యాటకులు అధికసంఖ్యలోవస్తే ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా కూడా చూడాలన్నారు. సమావేశంలో రాష్ట్రసాంస్కృతికశాఖ జేడీ మల్లికార్జునరావు, జడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఆర్డీవో కె.స్వాతి, మెప్మా పీడీ సాయిబాబు, డీపీవో అరుణ, పర్యాటకశాఖ అధికారి రామ్‌లక్ష్మణ్, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, మెరైన్ ఎస్ఐ జగదీష్ చంద్రబోస్ వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పది పరీక్షలకు 97.78 శాతం హాజరు

మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో బుధవారం నిర్వహించిన పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు 21,504 మంది విద్యార్థులకు 21,026 మంది హాజరయ్యారు. 97.78 శాతం నమోదైంది. 480 మంది ప్రైవేట్ విద్యార్థులకు 317 మంది హాజరయ్యారు. ఓపెన్ స్కూల్స్ పరీక్షలకు 1029 మందికిగాను 760 మంది హాజరయ్యారు. 73.86 శాతం హాజరు నమోదైనట్టు డీఈవో పి.వి.జె. రామారావు తెలిపారు. పరీక్షా కేంద్రాలను డీఈవో, పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ డేవిడ్‌రాజులు సందర్శించారు.



ఫిర్యాదులపై విచారణ జరుపుతున్న ఏపీవో లక్ష్మీరెడ్డి

ఉపాధి పనుల్లో చేతివాటం!

» విజయవాడ ఏపీవో విచారణ

మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బందరు మండలం ఎస్.ఎన్. గొల్లపాలెం గ్రామంలో పనులు చేయించకుండానే కొందరి పేర్లు పెట్టి అక్రమంగా బిల్లులు చేశారని వచ్చిన ఫిర్యాదులపై బుధవారం ఎన్ఆర్ఈజీఎస్ విజయవాడ ఏపీవో లక్ష్మీరెడ్డి విచారణ నిర్వహించారు. గ్రామానికి చెందిన కొనకళ్ల నవరంగప్రసాద్ కలెక్టర్‌కు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్.ఎన్. గొల్లపాలెం సచివాలయంలో లక్ష్మీరెడ్డి ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు విచారణ జరిపారు. విచారణలో ఫీల్డ్ అసిస్టెంట్ కోన సురేష్ సమక్షంలో పలువురిని లక్ష్మీరెడ్డి విచారించారు. పనికి వెళ్లని వారిని వెళ్లినట్టు చూపి వారి ఖాతాలో డబ్బులు జమచేశారని నవరంగప్రసాద్ ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు కొల్లూరి సురేష్, కొనకళ్ల గోపీ, జనసేన నాయకులు గణేష్, రామారావు, కొండేటి సుబ్రహ్మణ్యం, వీరంకి చైతన్య, రామకృష్ణ, ఈడే రాంబాబు తదితరులు పాల్గొన్నారు. 15 మందిని విచారించామని, నివేదికను డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ శివప్రసాద్‌యాదవ్‌కు అందచేస్తానని విచారణాధికారి తెలిపారు.

ఏపీలో కొబ్బరి బోర్డు ఏర్పాటు చేయండి

» ఎంపీ వల్లభనేని బాలాశౌరి

న్యూఢిల్లీ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్‌లో కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రప్రభుత్వానికి జనసేన ఎంపీ వల్లభనేని బాలాశౌరి విజ్ఞప్తి చేశారు. బుధవారం, లోక్‌సభలో రూల్ 377 కింద మాట్లాడిన ఎంపీ.. కొబ్బరి సాగు విస్తీర్ణంలో ఏపీ నాలుగో స్థానంలో ఉందన్నారు. ఏపీలో 2016-17లో హెక్టారుకు 11,481 కొబ్బరి కాయల దిగుబడి వస్తే..2022-23లో 9,018 కొబ్బరికాయల దిగుబడి వచ్చిందని తెలిపారు. దిగుబడి తగ్గుతుండంతో రాష్ట్రంలో కొబ్బరి ఉత్పత్తిని పెంచడానికి కొబ్బరి బోర్డును ఏర్పాటు చేయాల్సిన అవసరం ందని బాలాశౌరి అన్నారు.

గౌడవెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా శివరామప్రసాద్

మచిలీపట్నం, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : గౌడవెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా పెనమలూరు నియోజకవర్గానికి చెందిన శొంఠి శివరామప్రసాద్‌ను నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. రెండేళ్లపాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు.

మల్లవల్లికి కొత్త కళ

(5వ పేజీ తరువాయి)

యార్లగడ్డ వెంకట్రావు, చింతమనేని ప్రభాకర్ సారథ్యంలో టీడీపీ బాపులపాడు మండల కమిటీ ఆధ్వర్యంలో గజమాలతో సత్కరించారు. పెద్ద ఎత్తున అభిమానులు, టీడీపీ కార్యకర్తలు, నాయకులు, మహిళలు ఆయనకు నీరాజనాలు పలికారు. లోకేశ్‌కు పుష్పగుచ్చాలు అందించడానికి అభిమానులు, నాయకులు ఎగబడ్డారు. నూజివీడు డీఎస్పీ ప్రసాద్ ఆలయం వద్ద పోలీస్ బందోబస్తును పర్యవేక్షించారు. లోకేశ్‌కు స్వాగతం పలికిన వారిలో టీడీపీ బాపులపాడు మండల అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు, టీడీపీ తెలుగు మహిళా రాష్ట్ర ప్రధాన కారదర్శి మూల్పూరి సాయి కల్యాణి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతి చిన్నా, జనసేన నియోజకవర్గ సమన్వయకర్త చలమలశెట్టి రమేశ్‌బాబు, టీడీపీ నాయకులు వేములపల్లి శ్రీనివాసరావు, గుండపనేని ఉమావరప్రసాద్, ఆళ్ల గోపాలకృష్ణ, కొమ్మారెడ్డి రాజేశ్, వీరమాచేనేని సత్యప్రసాద్, అట్లూరి శ్రీనివాసరావు, నూలు నరసింహారావు, మొవ్వా వెంకటేశ్వరరావు, వేగిరెడ్డి పాపారావు, చింతల వెంకట శివ అప్పారావు, గండేపూడి నితీష్‌కుమార్, వడ్డి వాసవి, కాటుమాల విజయభాస్కర్, యనమదల సుధాకర్, పుసులూరు లక్ష్మీనారాయణ, లింగం శ్రీధర్, దయాల రాజీవ్, మండలంలోని పలు గ్రామాల సర్పంచ్‌లు, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, మహిళలు, యువత పెద్ద ఎత్తున తరలివచ్చి లోకేశ్‌కు స్వాగతం పలికారు.

ఎలక్ట్రికల్ బస్సుల దిశగా అడుగులు : ఆర్టీసీ ఎండీ ద్వారకా

అశోక్ లేలాండ్ సంస్థ వివిధ రకాల బస్సు లు ఇక్కడ తయారు చేయనుంది. ఆర్టీసీ కూడా ఈ బస్సులను పరిశీలిస్తుంది. మొత్తం 750 ఎలక్ట్రికల్ బస్సులు ఇప్పుడు ఆర్టీసీలో ఉన్నాయి. భవిష్యత్తులో మరిన్ని ఎలక్ట్రికల్ బస్సులు కొనుగోలు చేస్తాం. బస్సులు తయారీ సంస్థ రావడం ద్వారా ఆర్టీసీకి ఉపయోగకరంగా ఉంటుంది.

17 వేల ఉద్యోగాల కల్పన లక్ష్యం : ఎమ్మెల్యే యార్లగడ్డ

మల్లవల్లిలో 17 వేల ఉద్యోగాల కల్పన మా టార్గెట్. చంద్రబాబు 30 వేలు అంటున్నారు. అశోక్ లేలాండ్ ప్లాంట్ ప్రారంభించుకోవడం ఆనందంగా ఉంది. భవిష్యత్తులో మరిన్ని పరిశ్రమలు రావడం ద్వారా వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. చెప్పిన విధంగానే నేడు లోకేష్ చేతుల మీదుగా అశోక్ లేలాండ్ ప్రారంభమైంది. 15 వేల మందికి గన్నవరం నియోజకవర్గంలో ఉద్యోగాలు ఇప్పిస్తాం. ప్లాంట్‌లో ఇప్పుడు ఆరు వందల ఉద్యోగాలు ఇచ్చారు. త్వరలో మరో 1200 మందికి రానున్నాయి. మల్లవల్లిలో సంస్థల ఏర్పాటుకు 180 కంపెనీలు సిద్ధంగా ఉన్నాయి. అధికారులు పరిశీలించి నిబంధనలు మేరకు అనుమతి ఇవ్వాలి. రామవరప్పాడు వద్ద ఫ్లైఓవర్ నిర్మాణం కోసం పది కోట్లు అవసరం. నియోజకవర్గంలో రెండు కెనాల్స్‌ను కలిపేలా చర్యలు తీసుకోవాలి. ఎయిర్‌పోర్ట్ అభివృద్ధికి భూములు ఇచ్చిన రైతులకు పరిహారం ఇవ్వాలి. బ్రహ్మలింగయ్య చెరువును రిజర్వాయర్‌గా అభివృద్ధి చేయాలి. నా విన్నపాలను లోకేష్ బాబు పరిశీలించి నిధులు మంజూరు చేయాలని కోరుతున్నా.

ప్రేమ విఫలమై.. విద్యార్థి ఆత్మహత్య!



మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ప్రేమ విఫలం కావడంతో పదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతమిది. ఇనకుదురు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాసానిగూడెంలో అద్దెఇంట్లో ఉంటున్న లూథర్‌బాబు (18) ఓ అమ్మాయి ప్రేమ వ్యవహారం విఫలం కావడంతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వెంటనే అతడి స్నేహితులు జిల్లా సర్వజన ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. ఇనకుదురు ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయాలు అరికట్టండి

» సుంకర పద్మశ్రీ డిమాండ్



ఉంగుటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో విచ్చలవిడిగా పెరిగిపోయిన గంజాయి మత్తుపదార్థాల విక్రయాలు, బెట్టింగులు, బెల్టుషాపులను పూర్తిగా అరికట్టే దిశగా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ రాష్ట్ర నాయకురాలు, ఏఐసీసీ సభ్యురాలు సుంకర పద్మశ్రీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆత్కూరు పోలీస్‌స్టేషన్‌ను బుధవారం ఆమె సందర్శించారు. ఇటీవల బాలికపై జరిగిన సామూహిక అత్యాచారం కేసులో ఎస్ఐ, సిబ్బంది పనితీరును అభినందించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ, అత్యాచార నిందితుల్లో పలువురికి గంజాయికేసుల్లో పట్టుబడిన చరిత్ర వుందని, ఐదుగురు గంజాయి సేవించి అత్యాచారానికి పాల్పడినట్టు సమాచారం వుందన్నారు. గంజాయి మత్తులో యువత తప్పుదారి పడుతూ జీవితాల్ని నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.మాదకద్రవ్యాల విక్రయాలు, మహిళలపై అత్యాచారాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రభుత్వానిదేనని స్పష్టంచేశారు.

ఎన్టీటీపీఎస్‌లో భారీ అగ్నిప్రమాదం

(5వ పేజీ తరువాయి)

తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు అంటుకున్నాయి. ఈ ఘటనలో 490 మీటర్ల పొడవైన బెల్టులో 50 మీటర్ల వరకు పూర్తిగా కాలిపోయింది. అయినప్పటికీ మొత్తం బెల్టును మార్చాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ బెల్టు విలువ సుమారు రూ.140 కోట్లు ఉంటుందని చెబుతున్నారు. ప్రమాద సమయంలో అక్కడ కార్మికులు ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. అగ్నిమాపక సిబ్బంది దాదాపు 2గంటల పాట శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చారు. ఇటీవల బ్రాయిలర్‌లో పెయింట్ పనిచేస్తూ ఓ కాంట్రాక్టు కార్మికుడు మృతిచెందిన ఘటనను మర్చిపోకముందే ఈ అగ్నిప్రమాదం జరగడం వెనుక అధికారుల పర్యవేక్షణలోపమే ప్రధాన కారణంగా తెలుస్తోంది. వారం క్రితమే భద్రత వారోత్సవాలంటూ హడావుడి చేసిన ఎన్టీటీపీఎస్ అధికారులు ప్రమాదాలను నివారించడంలో పూర్తి నిర్లక్ష్యంగా ఉన్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. సమయపాలన లేకపోవడం, విధుల్లో ఉండాల్సిన అధికారులు బయటకు వచ్చి సొంత పనుల్లో నిమగ్నం కావడంతో పాటు వారి బాధ్యతారాహిత్యంతో ప్రమాదాలు పునరావృతం అవుతున్నాయని పలువురు బహిరంగంగానే ఆరోపిస్తున్నారు.



27న ఉపసర్పంచ్‌లకు ఎన్నికలు

» ఎన్నికల అధికారుల నియామకం : డీపీవో అరుణ

మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లాలో వివిధ కారణాల వల్ల ఖాళీగా ఉన్న ఉపసర్పంచ్ పదవులకు ఈ నెల 27న ఉదయం 11 గంటలకు ఎన్నికలు నిర్వహించనున్నట్టు జిల్లా పంచాయితీ అధికారి జె.అరుణ బుధవారం విలేకరులకు తెలిపారు. 23న పంచాయతీ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణపై విధివిధానాలను చెబుతారన్నారు. ఎన్నికల అధికారులను నియమించామని వీరికి శిక్షణ ఇస్తున్నామని డీపీవో తెలిపారు. గ్రామాల వారీగా వివరాలు.. పెడన (కాకర్లమూడి, అచ్చయ్యవారిపాలెం), ఘంటశాల (శ్రీకాకుళం), గుడ్లవల్లేరు (శేరీకల్వపూడి), గన్నవరం (కేసరపల్లి, అల్లాపురం), పమిడిముక్కల (తాడంకి, మంటాడ, అమీనాపురం, ఫతేల్లంక), ఉంగుటూరు (పెదవుటపల్లి), తోట్లవల్లూరు(పెనమకూరు, యాకమూరు), గూడూరు (ఆకులమన్నాడు), మోపిదేవి (నాగాయతిప్ప), మచిలీపట్నం (బోగిరెడ్డిపల్లి), పెనమలూరు (వేకనూరు), ఎన్టీఆర్ జిల్లాలో జి కొండూరు (కట్టుబడిపాలెం), ఇబ్రహీంపట్నం (తుమ్మలపాలెం), వత్సవాయి (మంగోలు), విజయవాడ రూరల్ (రామవరప్పాడు).

గందరగోళం..!

(5వ పేజీ తరువాయి)

జారీ చేసింది. ఓ ప్రత్యేక నెంబర్‌ను ఇచ్చింది. దీని ప్రాతిపదికన ఇచ్చిన డేటా ద్వారా ఎక్కడి కార్డులన్నవి వీఆర్వోలకు అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. దీంతో తమకున్న అనేక పని ఒత్తిళ్ల కారణంగా వీటిని పక్కన పెట్టేశారు. వారంలో రేషన్ కోటా విడుదలకు చర్యలు తీసుకునే తరుణంలో హఠాత్తుగా ఈ విషయం గుర్తుకురావటంతో ఉన్నతాధికారులు వీఆర్వోలను నిలదీస్తున్నారు. తమకు ఎదురవుతున్న సమస్యలను వివరిస్తూ రేషన్ డీలర్లకు ఇస్తే సముచితమని చెబుతున్నారు.

రేషన్ డీలర్లు ససేమిరా..!

ఈకేవైసీకి సంబంధించిన డేటాలు రేషన్ డీలర్లకు ఇస్తే పట్టించుకోవట్లేదు. కొంతమంది యూనియన్ నాయకులు ఈ వ్యవహారం పట్టించుకోవద్దని చెబుతున్నారు. దీంతో చాలా మంది డీలర్లు ఈకేవైసీ పనులు చేయట్లేదు. మామూలుగా ఈకేవైసీ చేయటానికి డీలర్లకు పెద్దగా సమయం పట్టదు. కొత్తగా ఆధార్ కార్డులు పొందిన పిల్లలే కాబట్టి డిపోకు 25 నుంచి 50 కార్డుల్లోపే ఉంటారు. ఇది పెద్ద కష్టమైన పనికాదు.

ఏజేపై విచారణ

(5వ పేజీ తరువాయి)

ఐ.దిలీప్‌కుమార్, పంకజ్‌కుమార్, బూర సుబ్రహ్మణ్యం, శశిదర్ తదితరులు బుధవారం కలిశారు. ఏజే విద్యాపరిషత్ ప్రైవేట్ వ్యక్తికి అప్పగించిన వైనాన్ని వివరించారు 1970, సెప్టెంబరు 16న అప్పటి ప్రభుత్వం ఏజే విద్యాపరిషత్‌పై వంశానుక్రమ వారసత్వంగా ఎవరికీ హక్కులేదని రికార్డుల్లో రాశారని వివరించారు. అయినా కోపల్లె హనుమంతరావును వారసుడిగా వైసీపీ ప్రభుత్వ కాలంలో ప్రకటించారని తెలిపారు. దీంతోపాటు ఏజే విద్యాపరిషత్‌లో భాగంగా ఉన్న బీఈడీ కళాశాల అన్ ఎయిడెడ్ కళాశాలగా మారినప్పటికీ 2015 వరకు యూజీసీ గ్రాంట్‌ను పొందారని తెలిపారు. ఈ విద్యాపరిషత్‌ను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని పునరుద్ధరించాలని వారు కోరారు. ఏజే విద్యాపరిషత్‌కు వివిధ జిల్లాల్లో 380 ఎకరాల భూమి కూడా ఉందని, ఆ భూమి దేవదాయ శాఖ పర్యవేక్షణలో ఉందని, లీజును నిర్ధారించడంలో, వసూలు చేయడంలో అనేక తేడాలు ఉన్నాయని, ఈ అంశంపైనా దృష్టి సారించాలని వారు విచారణ అధికారిని కోరారు. ఈ సందర్భంగా విచారణాధికారి పీవీఎల్ రమేశ్ మాట్లాడుతూ ఏజే విద్యాపరిషత్‌కు సంబంధించిన అంశాలపై పూర్తిస్థాయి విచారణచేసి, దేవదాయ శాఖ ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తానన్నారు.

తప్పతాగి.. దాష్టీకం

(5వ పేజీ తరువాయి)

సెంటర్‌కు చేరుకున్నారు. అప్పటికే తిరుపతమ్మ పుట్టినిల్లు అనిగండ్లపాడు నుంచి పసుపు కుంకుమల బండి పెనుగంచిప్రోలు చేరుకుంది. ఆ బండి వెంట ట్రాక్టర్లు, ఎడ్లబళ్లు, డీజే వాహనాలు కూడా రావడంతో పోలీసులు వైసీపీ వాహనాలను నిలిపివేశారు. సుమారు గంటపాటు అనిగండ్లపాడు వాహనాలను ముందుకు నడిపించారు. ఈ క్రమంలో పార్టీలవారీగా ఏర్పాటు చేసుకున్న డీజేల్లో పాటలు పెట్టుకుని ఎవరికి వారు హడావుడి చేశారు. సుమారు గంటపాటు ఈ పరిస్థితి కొనసాగుతున్నా పోలీసులు పట్టించుకోలేదు. దీంతో వైసీపీ కార్యకర్తలు రెచ్చిపోయారు. రోడ్డు పక్కన ఉన్న రాళ్లకుప్ప నుంచి రాళ్లు తీసుకుని టీడీపీ, జనసేన వాహనాలపైకి విసిరారు. ఏం జరుగుతుందో తెలుసుకునేలోపు చాలామంది టీడీపీ, జనసేన కార్యకర్తలకు గాయాలయ్యాయి. ఆ సమయంలో స్థానిక పోలీసులెవరూ అక్కడ లేరు. ఎస్ఐ కూడా విధులను విడిచిపెట్టి ఇంటికి వెళ్లినట్లు సమాచారం. పరిస్థితి విషమిస్తుండటంతో ప్రత్యేక విధులపై వచ్చిన విజయవాడ ట్రాఫిక్ ఏసీపీ రామచంద్ర సమీపంలో ఉన్న సిబ్బందిని తీసుకుని హుటాహుటిన ఘటనాస్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చే ప్రయత్నం చేశారు. అప్పటికే మద్యం మత్తులో విచక్షణ కోల్పోయి రాక్షసంగా ప్రవర్తిస్తున్న వైసీపీ కార్యకర్తలు వారిపై కూడా రాళ్లు రువ్వారు. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి.

శాఖల మధ్య సమన్వయలోపం

అల్లర్లు జరిగే అవకాశం ఉందని తెలిసినా.. తగినంత పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయకపోవటం, శాఖల మధ్య సమన్వయం లేకపోవటం వంటి పరిణామాలే ఈ పరిస్థితికి ఆజ్యం పోస్తున్నాయి. అమ్మవారి పుట్టినిల్లయిన అనిగండ్లపాడు నుంచి చీర, సారె, పసుపు కుంకుమలు ఊరేగింపుగా తీసుకురావడం తిరునాళ్లలో ముఖ్యమైన ఘట్టం. దీనిని తిలకించేందుకు ఈ ఏడాది సుమారు 70 వేల మంది భక్తులు వస్తుంటారు. బందోబస్తు నిమిత్తం సుమారు 500 మంది పోలీసు సిబ్బందిని కూడా కేటాయించారు. అంతమంది సిబ్బంది ఉన్నా విధినిర్వహణలో అలసత్వం వల్ల అల్లర్లు జరిగాయి. చివరకు నలుగురు పోలీసు సిబ్బందిపై అల్లరిమూకలు విచక్షణారహితంగా దాడులకు తెగబడ్డారు. పోలీస్ స్టేషన్ ఎదుటే జరిగిన ఈ ఘటన విస్మయానికి గురిచేసింది. ఈ ఘటనపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అల్లరిమూకలతో పాటు వారిని కట్టడి చేయడంలో విఫలమైన పోలీసులపై మండిపడుతున్నారు.

ప్రభలు, డీజే వాహనాలే అల్లర్లకు కారణం

పెనుగంచిప్రోలు తిరునాళ్లలో తొలినాళ్ల నుంచి రాజకీయ పార్టీల బలప్రదర్శన కొనసాగుతోంది. ప్రభలకు పార్టీ జెండాలు కట్టి ఊరేగింపులు జరుపుతున్నారు. ఈ సందర్భంగా ఎప్పటికప్పుడు ఉద్రిక్త పరిస్థితులు తలెత్తినా గతంలో ఎప్పుడూ దాడులకు తెగబడిన సందర్భాలు లేవు. ఈ ఏడాది వైసీపీ కార్యకర్తల మితిమీరిన ప్రవర్తన కారణంగా పెద్ద ఎత్తున అల్లర్లు చెలరేగాయి. సుమారు 50 పసుపు కుంకుమల బళ్లు బయల్దేరగా, టీడీపీ, వైసీపీ, జనసేన పార్టీలవారీగా నాయకుల వాహనశ్రేణి బయల్దేరింది. ఈ వాహనాల వెంటే డీజే వాహనాలు కూడా వచ్చాయి. మంగళవారం సాయంత్రం 5 గంటలకు ప్రారంభమైన ఊరేగింపు ఐదు కిలోమీటర్ల మేర ప్రయాణించి ఆలయం వద్దకు చేరుకునే సరికి అర్ధరాత్రి 2 గంటలైంది. అప్పటికే వేల మంది భక్తులు పసుపు కుంకుమలు తిలకించేందుకు వేచి ఉన్నారు. బళ్లు అక్కడకు చేరుకోవడంతో ఒక్కసారిగా భక్తులు కదిలారు. పోలీసులు అప్రమత్తంగా వ్యవహరించకపోవడంతో పసుపు కుంకుమ బండిని భక్తులు చుట్టుముట్టారు. ఈ నేపథ్యంలో తోపులాట జరిగింది. పసుపు కుంకుమలను గుడిలోకి తీసుకెళ్లేందుకు చాలా సమయం పట్టింది.

పోలీసుల ఉదాశీనత

వైసీపీ ర్యాలీ ఆసాంతం భయానక వాతావరణంలో సాగుతున్నా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోలేదు. పసుపు కుంకుమల బండి ఆలయం వద్దకు చేరగానే పోలీసులు ఊపిరిపీల్చుకున్నారు. టీడీపీ, జనసేన కార్యకర్తలు, వాహనాలతో పాటు పోలీసులపై కూడా దాడి చేసిన అల్లరిమూకలు స్టేషన్ ఎదుటే స్వైరవిహారం చేసినా కనీసం వారిని నిలువరించలేకపోయారు. అంత విధ్వంసం సృష్టించిన కార్యకర్తలను వెనుకేసుకొచ్చిన జగ్గయ్యపేట వైసీపీ ఇన్‌చార్జి తన్నీరు నాగేశ్వరరావు తన అనుచరులతో స్టేషన్ వద్ద విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం కొసమెరుపు. అల్లరిమూకలను సమర్థిస్తూ ఆయన చేసిన వ్యాఖ్యలపై టీడీపీ, జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

16 మందికి రిమాండ్

పెనుగంచిప్రోలు తిరునాళ్లలో అల్లర్లకు పాల్పడిన నిందితులను పోలీసులు కోర్టులో హాజరుపరిచారు. సోమవారం రాత్రి తిరునాళ్ల ఊరేగింపులో వైసీపీ శ్రేణులు వీరంగం సృష్టించిన విషయం తెలిసిందే. ఘటనలో కూటమి కార్యకర్తలతో పాటు నలుగురు పోలీసులకు గాయాలయ్యాయి. దీనిని సీరియస్‌గా తీసుకున్న పోలీసులు వెంటనే 16 మందిని అదుపులోకి తీసుకున్నారు. ఈటూరి వెంకటేశ్వరరావు, తూము గోపి, గనిసెట్టి మణికంట, యర్రంశెట్టి నాగబాబు, కుంచాల సాయి, వేల్పుల అజయ్‌కుమార్, డేరంగుల యాదగిరి, జొన్నలగడ్డ శ్రీహరి, శివరామ్‌బొట్ల నాగవెంకటేష్, చేని మహేష్, పసుపులేటి వరుణ్‌కుమార్, దార గౌతమ్, నందిపాము పవన్‌కుమార్, దాసరి నాగబాబు, కాకాని సంజయ్, షేక్ మస్తాన్‌వలిలను అరెస్టు చేసి బుధవారం జగ్గయ్యపేట కోర్టులో హాజరు పరిచారు. నిందితులకు మార్చి 2 వరకు రిమాండ్ విధించారు. వారిని మచిలీపట్నం జిల్లా జైలుకు తరలించారు. సీసీ కెమెరాల ఆధారంగా మరికొందరిపై కేసు నమోదు చేసే అవకాశం ఉన్నట్టు పోలీసులు తెలిపారు.

మృతుడి బంధువుల ఆందోళన

తిరునాళ్లలో ఆనందంగా గడిపేందుకు వత్సవాయి మండలం కొత్త వేమవరం గ్రామానికి చెందిన అన్నదమ్ములు గింజుపల్లి సాయిమణికంఠ, గోపీచంద్ మంగళవారం సాయంత్రం పెనుగంచిప్రోలు వచ్చారు. ఇద్దరూ క్రాస్ వీల్‌పై ఎక్కి సంతోషంగా ఉన్న సమయంలో వారు కూర్చున్న బుట్ట ఊడి పడింది. దూరంగా ఉన్న సిమ్మెంట్ రోడ్డుపై పడటంతో మణికంఠ (24) అక్కడికక్కడే మరణించగా, గోపీచంద్‌కు తీవ్ర గాయాలయ్యాయి. కేవలం అధికారుల నిర్లక్ష్యంతోనే మణికంఠ చనిపోయాడని తల్లిదండ్రులు, బంధువులు ఆరోపించారు. మణింకఠ మృతదేహంతో మంగళవారం రాత్రి పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళనకు దిగారు. సుమారు గంట సేపు అక్కడ ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, తదితరులు మృతుడి తల్లిదండ్రులకు నచ్చజెప్పి ఆందోళన విరమించారు. ఘటనపై పోలీసులు లీజుదారుడైన కాకాని శేషగిరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మృతుడి బంధువులు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

అభయాంజనేయ స్వామి హుండీ ఆదాయం రూ.12.08 లక్షలు



హనుమాన్‌జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): స్థానిక అభయాంజనేయ స్వామి ఆలయ హుండీని బుధవారం తెరిచి లెక్కించారు. గడిచిన 85 రోజులకుగాను హుండీలో రూ.12,08,963 ఆదాయం లభించినట్లు ఆలయ ఈవో తారకేశ్వరరావు తెలిపారు. ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ బి.సురేశ్‌కుమార్ పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది స్థానిక భజన సమాజం, ఆర్యవైశ్య సంఘం మహిళలు లెక్కింపులో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ చైర్మన్ పావులూరి రామా రావు వడ్డి వాసవి, బొమ్మిశెట్టి రామారావు, నారికమల్లి చంద్రశేఖర్, శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



చాగంటిపాడులో దగ్ధమైన వరి కుప్ప

వేర్వేరు చోట్ల అగ్నిప్రమాదం

రెండెకరాల వరి, మినుము దగ్ధం

ఉంగుటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చాగంటిపాడులో బుధవారం తెల్లవారుజామున జరిగిన అగ్నిప్రమాదంలో రెండెకరాల వరికుప్ప పూర్తిగా దగ్ధంకాగా 1.25లక్షల నష్టం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన శనగల రామ్మోహనరావు తన రెండెకరాల పొలంలో సార్వా వరిని సాగుచేశాడు. బుధవారం ఉదయం అటుగా వెళ్తున్న రైతుకి మం టల్లో తగలబడుతున్న వరికుప్ప కనిపించింది. వెంటనే ఆ పొలం రైతు రామ్మోహనరావుకు సమాచారం అందించారు. అతను పొలం చేరేటప్పటికి పూర్తిగా దగ్ధమయ్యింది.



కాలిపోతున్న మినుము పంట

ఉంగుటూరులో..

మినుము పంట నూర్పిడి చేసిన తర్వాత పొలంలో మిగిలిపోయిన పంట వ్యర్థాలను (బూగర, తుక్కు)తగలబెట్టే క్రమంలో పక్కపొలంలోకి మంటలు వ్యాపించి రెండెకరాల మినుముపంట పూర్తిగా దగ్ధంకాగా రూ. 80 వేలు నష్టం సంభవించింది. బుధవారం మధ్యాహ్నం పులిపాక బసవయ్య అనే రైతు తన మినుము పంట నూర్పిడి అనంతరం పొలంలో మిగిలిపోయిన పంట వ్యర్థాలను తగులబెట్టే క్రమంలో బూగర, తుక్కుకు నిప్పంటించాడు. అది కాలుతూ పక్కన వున్న వీర్ల వెంకటకృష్ణకు చెందిన రెండెకరాల మినుము పంటకు నిప్పు అంటుకుని పంట పూర్తిగా దగ్ధమైంది.



ఈడుపుగల్లు సర్పంచ్ ఇందిరకు సత్కారం

కంకిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఈడుపుగల్లు గ్రామానికి దేశ వ్యాప్తంగా గుర్తింపు తీసుకొచ్చిన సర్పంచ్ పందిపాటి ఇందిరను ఈడుపుగల్లు గ్రామస్థులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దేవినేని రాజా మాట్లాడుతూ, ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీ వల్లభనేని బాలశౌరీ సహకారంతో గ్రామంలో సర్పంచ్ పందిపాటి ఇందిర అనేక అభివృద్ధి కార్యక్రమాల చేపట్టారన్నారు. ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పార్టీ అధ్యక్షులు షకార్, జిల్లా కార్యదర్శి పందిపాటి సుధాకర్, ఆనంద్ విహార్, రావి సురేష్‌బాబు, సాంబయ్య, ప్రభాకర్, వెంకట్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.

బీరు సీసాతో దాడి

పెనమలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించడానికి బారు వద్దకు వెళ్లిన వ్యక్తిపై మరో వ్యక్తి బీరు సీసాతో దాడి చేయడంతో గాయాలతో ఆసుపత్రి పాలయిన ఘటనపై పెనమలూరు పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నిడమానూరుకు చెందిన అలిగినేని సురేంద్ర తన స్నేహితునితో కలిసి మద్యం సేవించడానికి నిడమానూరు రోడ్డులోని ఒక బార్‌వద్దకు ఈ నెల 18న వెళ్లాడు. అక్కడే మద్యం సేవించి ఉన్న నిడమానూరుకు చెందిన బూరాడ రాధాకృష్ణ తన గురించి చెడు ప్రచారం చేస్తున్నావంటూ సురేంద్రపై బీరుసీసాతో దాడి చేశాడు. సురేంద్రను స్థానికులు దగ్గర్లోని కామినేని ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలి

విజయవాడ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రూరల్ మండలం అంబాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ స్థలాలు కబ్జాకు గురికాకుండా అధికారులు పరిరక్షించాలని వైసీపీ గ్రామ కన్వీనర్ నల్లమోతు చంద్రశేఖర్ కోరారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ పరిధిలో పలు చోట్ల పంచాయతీకి చెందిన స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, కలెక్టర్, తహసీల్దార్ స్థాయి అధికారులు స్పందించి ప్రభుత్వ స్థలాల్లో బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు.

గర్భిణులకు సీమంతం

హనుమాన్‌జంక్షన్‌రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : గర్భిణులకు, చిన్నపిల్లల తల్లులకు, చిన్నారులకు ప్రభుత్వం అందిస్తున్న పోషకాహారాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా మంచి ఆరోగ్యం కలుగుతుందని సర్పంచ్ పిల్లా అనిత సూచించారు. వీరవల్లి ఆర్బీహెచ్ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. పోషకఅభియాన్‌పై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం స్వర్ణలత, మోహనకృష్ణ, హేమలత, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.



గర్భిణులకు సీమంతం చేస్తున్న సర్పంచ్ పిల్లా అనిత, హెచ్‌ఎం స్వర్ణలత





కంకిపాడు మార్కెట్ యార్డ్‌లో అపరాల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, ఎంపీపీ నెరుసు.. ఆరుగొలనులో..

రైతులను నట్టేట ముంచిన జగన్

అపరాల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

కంకిపాడు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అందరికీ అన్నం పెట్టే రైతులను గత వైసీపీ ప్రభుత్వం నట్టేట ముంచిందని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. కంకిపాడు మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన అపరాల కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వ హయాంలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి నగదు చెల్లించకుండా రైతులను ఇబ్బందులు పాలు చేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుమారు 60 వేల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల ఖాతాల్లో వంద కోట్లు జమ చేశారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన చరిత్ర కూటమి ప్రభుత్వానికే దక్కిందన్నారు. అదే విధంగా మార్కెట్ యార్డ్‌లో ఏర్పాటు చేసిన మినుము, పెసర కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగపరుచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ నెరుసు రాజ్యలక్ష్మి, వైస్ ఎంపీపీ దూళిపూడి కిషోర్, సీహెచ్‌సీ చైర్మన్ బోయిన రోహిణి కుమారి, ఉప సర్పంచ్ రాచూరి చిరంజీవి, మార్క్ ఫెడ్ డీఎం మురళీకృష్ణ, మండల వ్యవసాయ శాఖ అధికారి కిరణ్, సీహెచ్‌సీ డైరెక్టర్ చలవాది రాజ, జనసేన పార్టీ ప్రచార కమిటీ జిల్లా కో- ఆర్డినేటర్ పులి కామేశ్వరరావుతో పాటు పలు వురు కూటమి నాయకులు పాల్గొన్నారు.

ఆరుగొలనులో..

హనుమాన్‌జంక్షన్‌రూరల్ : ఆరుగొలను శ్రమించి పండించిన పెసర, మినుము తదితర పంటలను దళారులకు అమ్మి నష్టపోకుండా రైతు ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసిందని, సద్వినియోగం చేసుకోవాలని మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తుమ్మల బ్రహ్మాజీ, బేతా శేషుకుమార్ అన్నారు. ఆరుగొలను పీఏసీఎస్‌లో మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరను నేరుగా రైతుకు అందేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, తగిన నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పెసర, మినుము పంటలను అమ్ముకోవాలని సూచించారు. తేమశాతం 12, పాక్షికంగా రంగుమారిన, ముతక గింజలు 3శాతం మాత్రమే ఉండే పెసలు క్వింటాలు రూ. 8,682, మినుము క్వింటాలు రూ. 7400కు నేరుగా అమ్మి 10 రోజుల్లో నగదు రైతు ఖాతాకు జమయ్యేలా చర్యలు తీసుకు న్నారని వివరించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకుడు వీరం వినయ్‌కుమార్, తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.



మంత్రి లోకేశ్‌కు ఎఫ్ఎఫ్‌బీ ఫార్ములా జీవో జారీ చేయాలని వినతిపత్రం అందజేస్తున్న రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు బొబ్బా

సమస్యలు పరిష్కరించండి

మంత్రి నారా లోకేశ్‌కు వినతిపత్రాలు అందజేత

గన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాపులపాడు మండలం హనుమాన్ జంక్షన్‌కు బుధవారం వచ్చిన మంత్రి నారా లోకేశ్‌కు పలు సమస్య లపై వినతి పత్రాలను అందజేశారు. గ్రామాలలో కోతుల వలన కోట్ల రూపాయల పంట నష్టం పెరు గుతుందని, ఇళ్ల వద్ద కూరగాయలు, పూలమొక్కలు పాడు చేస్తున్నాయని, మహిళలు, పిల్లలపై దూకి గాయాలు చేస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నా యని తెలుగు రైతు రాష్ట్ర కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు లోకేశ్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే యువగళం పాదయాత్రం సందర్భంగా పార్టీ కార్యకర్తలపై బనాయించిన అక్రమ కేసులతో పాటు ఇటీవల మట్టి, గ్రావెల్ మాఫియాకు అడ్డుపడుతు న్నారని టీడీపీ కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసు లను మాఫీ చేయించాలని కోరారు. ● ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని మల్లవల్లి గ్రామస్థులు మరో వినతిపత్రాన్ని అందజేశారు. యువగళం పాదయాత్ర సమయంలో గ్రామానికి వచ్చినప్పుడు పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని విన్నవించుకోగా సానుకూలంగా స్పందించారని గుర్తుచేశారు. ● రాష్ట్రంలోని ఆయిల్ పామ్ రైతుల సమస్యలపై దృష్టి సారించి సమస్యలను పరిష్కరించినం దుకు రాష్ట్ర ఆయిల్‌పామ్ రైతుల సంక్షేమ శాఖ అధ్యక్షుడు బొబ్బా వీర రాఘవరావు మంత్రి లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ ఎఫ్ఎఫ్‌బీ ఫార్ములా ప్రైస్-రెజిడ్‌తో సమానంగా 2024-25 సంవత్సరానికి ఎఫ్ఎఫ్‌బీ ఫార్ములా జీవో జారీ చేయాలని వినతిపత్రం అందజేశారు.

ఆదిత్య బధిర విద్యార్థులకు అన్నదానం

హనుమాన్‌జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక ఏలూరు రోడ్డులోని ఆదిత్య బధిర విద్యాలయం విద్యార్థులకు బుధవారం బాపులపాడు మాజీ ఉప సర్పంచ్ కాకాని బాబు రూ.10 వేలు ఆర్థికసాయం అందజేశారు. కాకాని బాబు సతీ సమేతంగా తన జన్మదిన వేడుకను ఆదిత్య బధిర విద్యార్థుల సమక్షంలో జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రెండు రోజులు పాటు అన్నదానం నిర్వహణకు అవసరమైన ఆర్థికసాయం అందించారు. దీంతో పాటు స్థానిక ఏలూరు రోడ్డులోని ఆశా జ్యోతి మానసిక దివ్యాంగుల పాఠశాలకు, గుడివాడ రోడ్డులోని ప్రజ్వల అనాథ ఆశ్రమానికి రూ. 10వేలు చొప్పున కాకాని బాబు ఆర్థికసాయం అందజేశారు. పాఠశాలల విద్యార్థులు, నిర్వాహకులు ఆకుల వెంకటరమణ, ఇమంది అన్నపూర్ణ, మరీదు వెంకట స్వామి ఉపాధ్యాయులు బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.



ఉంగుటూరు పరీక్షా కేంద్రంలో విద్యార్థులకు సూచనలు ఇస్తున్న ఎంఈవో జె.సాంబశివరావు

ప్రశ్నాపత్రాలు చింపి రోడ్లపై వేయొద్దు

ఉంగుటూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులు పరీక్ష ముగించుకుని ఇంటికి వెళ్లే క్రమంలో ప్రజలను ఇబ్బందిపెట్టేలా ప్రవర్తించరాదని, ముఖ్యంగా ప్రశ్నాపత్రాలను చించి రోడ్లపై వేయరాదని ఎంఈవో-2 జె.సాంబశివరావు విద్యార్థులకు సూచించారు. పదవ తరగతి విద్యార్థులకు బుధవారం జరిగిన హిందీ పరీక్ష మండలంలోని ఏడు పరీక్షా కేంద్రాల్లో ప్రశాంతంగా ముగిసింది. మొత్తం 626మంది విద్యార్థులకుగాను 609 విద్యార్థులు పరీక్ష రాయగా 17మంది గైర్హాజరయ్యారు.

అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలి

గన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాలికపై అత్యాచారం చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి బి.కీర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సంఘ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ, మైనర్ బాలికపై గ్యాంగ్ రేప్ చే యటం సభ్య సమాజం తలదించుకునే విషయమన్నారు. జి.కొండూరుకు చెందిన బాలికకు న్యాయం చేసి నిందితులను కఠినంగా శిక్షించాలన్నారు. బుద్ధవరం సర్పంచ్ బడుగు బాలమ్మ, ఐద్వా నాయకులు స్వరూపరాణి, సీహెచ్‌వీ లక్ష్మి పాల్గొన్నారు.

మెరుగైన విద్యుత్ సరఫరాకు కృషి

ఉయ్యూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేయాలన్నది ఏపీసీపీడీసీఎల్ లక్ష్యమని విద్యుత్‌శాఖ ఎస్ఈ సత్యానందం అన్నారు. ఉయ్యూరు పరిధిలో విద్యుత్ ఉద్యోగులు, వినియోగదారులతో బుధవారం స్థానిక ఊరా కన్వెన్షన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వేసవిలో వినియోగదారులకు అంతరాయం లేకుండా నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని, ప్రమాదాలకు తావులేకుండా ఉద్యోగులు శ్రద్ధ వహించాలన్నారు. విద్యుత్ బిల్లులు గడువులోపల చెల్లించి సంస్థకు సహకరించాలన్నారు. సోలార్ విద్యుత్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని, ప్రధానమంత్రి సూర్యఘర్ పథకం సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈఈ కృష్ణనాయక్, ఏడీఈ హే మంత్‌కుమార్ పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

ఉయ్యూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : బాలికను లోబరుచుకుని గర్భవతిని చేసిన యువకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసినట్టు ఉయ్యూరు సీఐ టీవీవీ రామారావు బుధవారం తెలిపారు. పంచాయతీ బజార్‌లో నివసించే బాలికను, ఎస్సీ కాలనీకి చెందిన కె. చందు లోబరుచుకుని గర్భవతిని చేసిన ట్టు బాలిక తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

పెనమలూరు, మార్చి19 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు క్రాస్ చేస్తున్న మహిళను ద్విచక్రవాహనం ఢీకొనడంతో గాయాలపాలై ఆసుపత్రిలో చేరిన ఘటనపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తాడిగడప లంబాడీపేటకు చెందిన మేకల అనసూయమ్మ పోరంకిలో ఇళ్లలో పనులు చేసుకొని జీవనం సాగిస్తుంది. ఈ నెల 13న పోరంకి క్యాపిటల్ ఆసుపత్రి వద్ద తన పనులు ముగించుకొని రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం వేగంగా ఢీకొనడంతో తీవ్ర గాయాలపాలయింది. చికిత్స నిమిత్తం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మామిడి తోటను పరిశీలిస్తున్న హార్టీకల్చర్ అధికారి హరిచంద్

మామిడి పండ్లను పరిరక్షించుకోవాలి

గన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మామిడి పండ్లను పరిరక్షించుకుంటేనే మేలు అని హార్టీకల్చర్ అధికారి ఇ.హరిచంద్ అన్నారు. మండలంలోని గోపవరపుగూడెం గ్రామంలోని మామిడి తోటలను బుధవారం సందర్శించి, రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిచంద్ మాట్లాడుతూ, మామిడి పండ్ల పరిరక్షణ కోసం ప్రభుత్వం ప్రత్యేక కవర్‌లను సబ్సిడీపై సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. కవర్‌లు వినియోగించటం వల్ల పురుగుల దాడి తగ్గుతుందన్నారు. కవర్‌లను ప్రభుత్వం ఒక్క రూపాయి సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్లు చెప్పారు. వీటి వల్ల రసాయనిక ఎరువుల అవసరం ఉండదన్నారు. పండ్ల రంగు, ఆకృతి మెరుగు పడుతుందన్నారు. దిగుబడి పెరిగి ఆదాయం వస్తుందని తెలిపారు. హార్టీకల్చర్ అసిస్టెంట్ దీక్ష, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు నల్లూరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పోరాటాలతోనే సమస్యల పరిష్కారం

గన్నవరం, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కార్మికులు పోరాటాలు చేస్తేనే సమస్యలు పరిష్కారం అవుతాయని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.ఉమామహేశ్వరరావు అన్నారు. మండలంలోని ముస్తాబాద రిలయన్స్ గోదాము వద్ద ఆందోళన చేస్తున్న కార్మికులకు బుధవారం సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కార్మికులతో వెట్టి చాకిరి చేయిం చుకుని వేతనాలు ఇవ్వకపోవటం దుర్మార్గమన్నారు. సమస్య పరిష్కారం అయ్యేంత వరకూ తన పోరాటాన్ని కొనసాగించాలని కార్మికులకు అండగా సీఐటీయూ నిలుస్తుందన్నారు. నాయకులు కళ్లం వెంకటేశ్వరరావు, నరసింహరావు, శ్రీని వాసరావు, రాంబాబు, దాసే బాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉమామహేశ్వరరావు



మెంటార్లను సత్కరిస్తున్న పీవీపీ కళాశాల యాజమాన్యం

పీవీపీ సిద్ధార్థలో ఏటీఎల్ మెంటార్లకు సత్కారం

పెనమలూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం అటల్ టింకరింగ్ ల్యాబ్ (ఏటీఎల్) మెంటార్లుగా సేవలందించిన 31మంది సిబ్బందిని, 155 మంది విద్యార్థులను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు దగ్గర్లోని ఉన్నత పాఠశాలలకు వెళ్లి విద్యార్థులకు ప్రాథమిక సాంకేతికతా పరిజ్ఞానాలపై శిక్షణ ఇచ్చినందుకు సత్కరించినట్లు కళాశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో యూనిసెఫ్ ఇండియా చీఫ్ ఆఫీసర్ జెలాలెం బీ టాఫెస్సే, సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ ప్రసన్నకుమార్, నీతి ఆయోగ్ ప్రోగ్రాం మేనేజర్ ప్రతీక్ దేశ్‌ముఖ్, సీఈవో ప్రొఫెసర్ దేవకుమార్, పిన్సిపాల్ డాక్టర్ శివాజీబాబు, ఎస్ఎస్ఎస్ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామిని దర్శించుకున్న నటుడు ధర్మా



స్వామివారిని దర్శించుకుంటున్న నటుడు కాకాని ధర్మా

హనుమాన్‌జంక్షన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అభయాంజనేయ స్వామిని యువ నటుడు, డ్రింకర్ సాయి చిత్ర కథా నాయకుడు కాకాని ధర్మా మంగళవారం రాత్రి దర్శనం చేసుకున్నారు. తాను నటించిన డ్రింకర్ సాయి చిత్రపరిశ్రమలో మంచి టాక్‌ను సొంతం చేసుకోవడంతో ఆంజనేయ స్వామి మాలధారణ చేశారు. మాలధారణ విరమణ పురస్కరించుకొని ఆంజనేయస్వామి దర్శనం చేసుకున్నారు. తమలపాకు పూజ నిర్వహించారు. పూజలు అనంతరం ఆలయ అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు స్వామి వారి శేషవస్త్రం, తీర్థ ప్రసా దాలతో పాటు ఆశీర్వచనాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ నిర్మాత, హీరో ప్రభాస్ బావ నరేంద్ర, ధర్మా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్‌బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

ఈ-శ్రమ్‌కు విశేష స్పందన

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఆటోనగర్‌లో కార్మికశాఖ తరుపున బుధవారం ఏర్పాటుచేసిన ఈ-శ్రమ్ కేంద్రానికి విశేష స్పందన లభించింది. ది కృష్ణాజిల్లా ఇండస్ట్రీయల్ అండ్ ఆటోమొబైల్ వర్కర్స్ యూనియన్ పిలుపు మేరకు ఈ నెల 15వతేదీ నుంచి మొత్తం 480మంది కార్మికులు తమ పేర్లను ఈ-శ్రమ్‌లో నమోదు చేసుకున్నారని యూనియన్ అధ్యక్షులు అబ్దుల్ అమీర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి టి.లక్ష్మణరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఖుద్దూస్, నాయకులు ఆంజనేయులు, మొహిద్దీన్, ఆదినారాయణ, వీర్రాజు, నాగరాజు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



ఈ -శ్రమ్ పోర్టల్‌లో పేర్లు నమోదు చేసుకుంటున్న కార్మికులు

అధ్వాన రహదారిపై తప్పని ఫీట్లు

● నిత్యం ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు ● పట్టించుకోని అధికారులు

(ఆంధ్రజ్యోతి - గుడివాడ రూరల్) : గుడివాడ రూరల్ మండలంలోని దొండపాడు వెళ్లే ప్రధాన రహదారిపై భారీస్థాయి గోతులుపడి, గులకరాళ్లు పైకి తేలాయి. దీంతో ప్రయాణీకులు రాకపోకల సమయాల్లో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారిలో ప్రయాణించాలంటే వాహనదారులు సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తుంది. గుడివాడ నుంచి దొండపాడు, మోటూరు, గుంటాకోడూరు, గొల్వేపల్లి వెళ్లే ప్రయాణికులు నిత్యం రోడ్డు ప్రమాదాల భారీన పడక తప్పడం లేదు. ధ్వంసమైన రహదారికి మరమ్మతులు చేయించాలని వాహనదారులు ప్రజాప్రతినిధులను కోరారు దీంతో రహదారికి అక్కడక్కడా ప్యాచ్‌వర్క్‌లు చేశారు. ముఖ్యంగా చిలకమూడి డ్రాప్ నుంచి దొండపాడు గ్రామం వరకు రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ముఖ్యంగా వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణం చేయాలంటే సర్కస్ ఫీట్లు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతోపాటుగా రహదారిపై ఏర్పడ్డ గోతులతో వాహనాలు అదుపుతప్పి ప్రమాదాల భారీన సందర్భాలు ఉన్నాయని వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారికి మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఎన్నిసార్లు పిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న దాఖలాల్లేవని సర్వత్రా విమర్శలు వినవస్తున్నాయి. సదరు అధికారులు స్పందించి నిధులు మంజూరు చేసి, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతిపాదనలు పంపించాం

రహదారి మరమ్మతుల నిమిత్తం అత్యవసర నిధుల కింద రూ.40 లక్షలు నిధులు వచ్చాయి. వీటితో రహదారిపై అక్కడక్కడ ప్యాచ్ వర్క్‌లు చేశాం. పూర్తి రహదారి నిర్మాణానికి నాబార్డు నుండి రూ.2 కోట్లు అంచనాలు రూపొందించి పంపించాం. ఇంకా అనుమతులు రాలేదు. అనుమతులు వస్తే పనులు చేయిస్తాం.

వీరాస్వామి, ఆర్‌అండ్‌బీ ఏఈ



రహదారిపై పైకి తేలిన గులకరాళ్లు



భారీ గోతులతో నిండిన ఆర్‌అండ్‌బీ రహదారి



పోలుకొండలో పావనగిరిమాత పుణ్యక్షేత్రం

పావనగిరిమాత మహోత్సవాలు 21నుంచి

నందివాడ, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 21, 22, 23 తేదీల్లో పావనగిరిమాత పుణ్యక్షేత్ర మహోత్సవాలను పోలుకొండలో నిర్వహిస్తున్నట్టు ఆర్‌సీఎం చర్చి ఫాదర్ డి.అనీల్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పావనగిరి మాత పుణ్యక్షేత్రం మహోత్సవాలను ప్రతి ఏడాదీ గ్రామస్థుల సహాయ , సహకారాలతో నిర్వహిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా 21వ తేదీ శుక్రవారం పావనగిరి మాతను గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించనున్నామన్నారు. అనంతరం పరిశుద్ధ జపమాల సిలువ మార్గం, దివ్యబలిపూజ , పవిత్రాత్మ స్వస్థత ప్రార్థనలు చేస్తామని వివరించారు. 22వ తేదీ శనివారం నాగభూషణపురం, శంకరంపాడు గ్రామాల్లో పావనగిరి మాత ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం వివిధ గ్రామాల పాస్టర్లచే స్వస్థత ప్రార్థనలు చేయనున్నారు. 23వ తేదీ ఆదివారం సమిష్టి దివ్య బలి పూజ విజయవాడ పీఠాధిపతులు తెలగతోటి జోసఫ్ రాజారావు , వివిధ పట్టణాల విచారణ కర్తలచే ప్రార్థనలు, గీతాలపనలు జరుగుతాయని ఫాదర్ అనీల్ కుమార్ తెలిపారు. అనంతరం ఈ మహోత్సవ కార్యక్రమాలలో పాల్గొనే భక్తులకు భోజనం ఏర్పాట్లు కల్పిస్తున్నట్టు ఫాదర్ తెలిపారు

పన్నులు సకాలంలో చెల్లించాలి

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : మున్సిపాల్టికి చెల్లించాల్సిన ఆస్తి, నీటి , ఖాళీ స్థలాల పన్నులను ఈ నెల 31వ తేదీలోగా చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నులు చెల్లించే వారు నేరుగా మున్సిపల్ కార్యాలయంలోగానీ, ఆన్‌లైన్ ద్వారా చెల్లించవచ్చన్నారు. సెలవు రోజుల్లోనూ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్‌లను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

వీరమ్మతల్లికి ప్రత్యేక పూజలు

గుడ్లవల్లేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : మామిడికోళ్లలో నూతనంగా నిర్మించి, ప్రతిష్ఠించిన వీరమ్మతల్లి ఆలయంలో అమ్మవారిని మండల టీడీపీ అధ్యక్షులు కొసరాజు బాపయ్య చౌదరి, విజయ దంపతులు బుధవారం దర్శించుకొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులైన తోట మల్లిఖార్జునరావు, రాధిక దంపతులు, జట్టి శ్రీరామ్ (యుఎస్‌ఏ)లు సత్కరించి అమ్మవారి ప్రసాదాన్ని అందచేశారు. గ్రామస్థులు, దాతలు ఆలయాన్ని చక్కగా నిర్మించారని కొసరాజు నిర్వాహకులను అభినందించారు.

సృజనాత్మకతను వెలికితీయడమే ధ్యేయం

గుడ్లవల్లేరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : అంగలూరు డైట్ కళాశాలలో ప్రథమ సంవత్సరం ఉపాధ్యాయ శిక్షణపొందుతున్న విద్యార్థులకు బుధవారం ఆర్ట్ ఎడ్యుకేషన్ వర్క్‌షాప్ నిర్వహించారు. వేస్ట్ మెటీరియల్స్‌ను వినియోగించి వారు రూపొందించిన కళాకృతులు పలువురిని అబ్బురపరిచాయని కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ అన్నారు. ఇటువంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందుతుందన్నారు. అధ్యాపకులు మోహినీ కుమారి, డాక్టర్ వినయ్ కుమార్, జయశ్రీ, ప్రకాశం, రాజ్యలక్ష్మి తదితరులు ఉన్నారు.

పేదలకు భోజనం పంపిణీ

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ఆకలితో ఉన్న అన్నార్తులకు పట్టణ ఆర్‌కె వారియర్స్ సభ్యులు కుంభం అయ్యప్ప తన తల్లి బేబీనాంచారమ్మ జ్ఞాపకార్థం భోజన వసతి కల్పించడం అభినందనీయమని బీజేపీ టూటౌన్ అధ్యక్షులు మాచర్ల రామకృష్ణ(ఆర్.కె) కొనియాడారు. నాంచారమ్మ వర్ధంతి సందర్భంగా స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులో బుధవారం పేదలకు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో లంకా రాంబాబు, గాదె చరణ్, ఆర్‌కె వారియర్స్ పాల్గొన్నారు.

కూచిపూడి ఎస్సైగా నాగ విశ్వనాథ్

కూచిపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): కూచిపూడి ఎస్సైగా నాగవిశ్వనాథ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన విజయవాడ సైబర్ క్రైమ్ ఎస్సైగా పని చేస్తూ కూచిపూడికి బదిలీ అయ్యారు. ఇప్పటివరకు ఎస్సైగా పని చేసిన ఎం.సుబ్రహ్మణ్యం భీమవరం బదిలీపై వెళ్లారు. ట్రాఫిక్ సమస్యలతో పాటు కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయనున్నట్టు విశ్వనాథ్ ఈ సందర్భంగా తెలిపారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించాలి

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన విధంగా ఒంటిపూట బడులను అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు పాటించాలని, నిబంధనలు పాటించని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక సుందరయ్యభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గుడివాడలోని చైతన్య, నారాయణ, గౌతమ్, విశ్వభారతి, త్రివేణి, విద్యావికాస్ వంటి పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలు పాటించని పాఠశాలలపై కఠినమైన చర్య తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

చర్చి ఫాదర్‌కు సత్కారం

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరూ దేవుడు చూపిన మార్గంలోనే పయనించి తోటి వారికి సహాయకులుగా ఉండాలని మౌంట్ కార్మెల్ ఆర్సీఎం చర్చి ఫాదర్ గుజ్జుల మైఖేల్ అన్నారు. బుధవారం స్థానిక మౌంట్ కార్మెల్ దేవాలయంలో ఫాదర్ గుజ్జుల మైఖేల్ 42వ సంవత్సరంలో అడుగిడిన సందర్భంగా సహాయ గురువు అందుగుల శ్రీకాంత్, సీపీయార్ సిస్టర్ బృందం ఆయన్ని దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దివ్యబలి పూజ నిర్వహించారు. కౌన్సిల్ సభ్యులు రెబ్బా బాలరాజు, వి.జీవరత్నం, ఇంటి స్వామిదాసు, ఉపదేశకులు దారా సెబాష్టీయన్, క్రీస్తురాజు, భాస్కర్, ఆంథోని, స్వామిదాసు, మరియదళ సభ్యులు, దీక్షాపరులు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు బ్యాంకు రుణాలు అందించడమే లక్ష్యం

● జిల్లా లీడ్‌బ్యాంక్ మేనేజర్ వి. రవీంద్రారెడ్డి

గుడివాడ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల రుణాలతోపాటుగా రైతులకు అవసరమైన వ్యవసాయ పంటరుణాలు తక్షణమే అందించడమే లక్ష్యమని జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ వి. రవీంద్రరెడ్డి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో గుడివాడ నియోజకవర్గ బ్యాంకర్లతో బుధవారం లీడ్ బ్యాంక్ మేనేజర్ వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్వాక్రా గ్రూపులకు, రైతులకు, చిరువ్యాపారులకు అర్హత ఉన్న వారందరికీ రుణాలు అందించాలని చెప్పారు. ఆర్‌బీఐ గైడ్ లైన్స్ ప్రకారం ప్రతీ బ్యాంక్ అధికారి స్పష్టంగా తమ విధులు నిర్వహించాలని తెలిపారు. మొండి బకాయిలు ఏమైనా ఉంటే సంబంధిత అధికారులతో కూర్చుని వారి వద్ద నుంచి వసూలు చేయటానికి కృషి చేద్దామన్నారు. ఎంపీడీవో డి.వై.విష్ణు ప్రసాద్, గుడివాడ నియోజకవర్గ వివిధ శాఖల బ్యాంక్ అధికారుల పాల్గొన్నారు.

పామర్రు : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో కె.జ్యోతితో కలిసి పామర్రు నియోజకవర్గ బ్యాంకర్లతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగ యువత ఉపాధికోసం ప్రభుత్వ రాయితీతో అందించే రుణాలను వీలైనంత త్వరగా అందించి వారి ఆర్థికాభివృద్ధికి తోడ్పడాలన్నారు. పామర్రు, తోట్లవల్లూరు, పమిడిముక్కల మండలాలకు చెందిన బ్యాంకు అధికారులు,వెలుగు ఏపీఎంలు పాల్గొన్నారు.



సమావేశంలో ప్రసంగిస్తున్న లీడ్ బ్యాంక్ మేనేజర్ రవీంద్రారెడ్డి

నాణ్యతాప్రమాణాలు తప్పనిసరి

● బల్లిపర్రు గ్రామసర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్

పామర్రు, మార్చి19 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రభుత్వ నిధులుతో నిర్మించే అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు తప్పక పాటించే బాధ్యతను కాంట్రాక్టర్లు విస్మరించరాదని బల్లిపర్రు గ్రామసర్పంచ్ నిమ్మగడ్డ సుధాకర్ పేర్కొన్నారు. మండల పరిధిలోని బల్లిపర్రు ఎస్సీకాలనీలో ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా చొరవతో మంజూరైన పీఎంజీఆర్ నిధులు రూ. 20లక్షలతో నిర్మితమవుతున్న పక్కాడ్రెయినేజీ నిర్మాణాలను గ్రామ టీడీపీ నేత తమ్మారెడ్డి సంజీవరావుతో కలసి సుధాకర్ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమగ్రామాభివృద్ధికి ఎమ్మెల్యే అందిస్తున్న సహాయసహకారం మరువలేమన్నారు. పనులు నాణ్యత విషయంలో ఖచ్చితంగా ప్రభుత్వనిబంధనలు పాటించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో పలువురు గ్రామ టీడీపీ నేతలు తదితరులు పాల్గొన్నారు.



ఎస్సీకాలనీలో కొనసాగుతున్న పక్కాడ్రెయినేజీ నిర్మాణం

మంచినీటి సరఫరాకు అంతరాయం నేడు

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని 3 నుంచి 18వ వార్డు వరకు, 20వ వార్డులకు గురువారం నీటిసరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, ఆయా ప్రాంతాల ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు తెలిపారు. పురపాలక సంఘ పరిధిలో బుధవారం జాతీయ రహదారుల శాఖ ఆధ్వర్యంలో వాటర్ ట్యాంకులకు మంచినీటి సరఫరా చేయడానికి పంపింగ్ మెయిన్ అంతర్గత కనెక్షన్ పనులు చేపట్టారన్నారు. ఈ పనులను శాంతినగర్, నక్కల కాలువ, గుడ్‌మెన్‌పేట, ఆర్టీసీ కాలనీల్లోని వాటర్ ట్యాంకుల వద్ద నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

మద్యం దుకాణం ఏర్పాటు చేయొద్దు



మద్యం దుకాణం వద్దంటూ నినాదాలు చేస్తున్న మహిళలు

పెదపారుపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెదపారుపూడిలో రెండో వైన్‌షాపు ఏర్పాటుకు వ్యతిరేకంగా విజయవాడ టూ గుడివాడ రహదారిపై బుధవారం మహిళలు ధర్నా నిర్వహించారు. ఇప్పటికే ఈ గ్రామంలో ఒక వైన్ షాపు ఉంది. అయితే అదే సెంటర్‌లో మరో వైన్ షాపు ఎలా పెడతారని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. నూతనంగా ఏర్పాటు చేయనున్న వైన్ షాపు చర్చికి కనీసం మీటర్ దూరంలో ఉందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వైన్‌షాపు ఏర్పాటు చేయడం వల్ల స్కూల్ పిల్లలకు రక్షణ లేకుండా పోతుందని వారు మండిపడ్డారు. ముఖ్యంగా గురువిందగుంట, మహేశ్వరపురం, దూళ్లవానిగూడెం, దోసపాడు, 4 గ్రామాల నుంచి 300 మంది మహిళలు వద్దు వద్దు వైన్ షాపు వద్దు ..అంటూ నినాదాలు చేశారు. ఈ ధర్నాకి సర్పంచ్ చప్పిడి సమీరా, వైస్ ప్రెసిడెంట్ నాగనబోయిన గాంధీ, టీడీపీ సీనియర్ నాయకుడు చిలకా ఆంజనేయులు మద్దతుగా నిలిచారు. ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి సిబ్బందితో కలసి ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు.

ప్రతి రైతుకూ నిర్దిష్ట సంఖ్య తప్పనిసరి

● ఏవో బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): సొంత పొలం ఉన్న ప్రతి ఒక్క రైతూ తప్పనిసరిగా ఆర్‌ఎస్‌కేలలో తమ పేర్లు నమోదు చేయించుకుని నిర్దిష్ట సంఖ్యను పొందాలని ఏవో బోలెం అనంతలక్ష్మి తెలిపారు. చౌటపల్లిలోని ఆర్ఎస్‌కేను ఆమె బుధవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆర్ఎస్‌కేలో ఎంత మంది రైతులు నమోదు చేసుకున్నారు. 15 అంశాలకు సంబంధించి ఎంత మంది రైతుల నుంచి స్పందన వచ్చింది. మిగిలిన రైతులు ఎందుకు చేయించుకోవటం లేదో ఆ సిబ్బందిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతులతో మాట్లాడి తప్పనిసరిగా చేసుకోవాలని తెలిపారు. మినుము పంట ఎన్ని క్వింటాళ్లు ఉన్నాయో ఆర్‌ఎస్‌కేలో నమోదు చేయించుకుని ప్రయోజనం పొందాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చౌటపల్లి రైతులు, ఆర్ఎస్‌కే సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



చౌటపల్లిఆర్ఎస్‌కే వద్ద రైతులతో మాట్లాడుతున్న ఏవో బోలెం అనంతలక్ష్మి



రికార్డులు పరిశీలిస్తున్న పీడీ ఎంఎన్.రాణి

అంగన్వాడీ కేంద్రంలో తనిఖీలు

కూచిపూడి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కారకంపాడు అంగన్వాడీ కేంద్రాన్ని స్త్రీ, శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారిణి ఎం.ఎన్.రాణి బుధవారం తనిఖీ చేశారు. ప్రీ స్కూల్ పిల్లల సంఖ్య, హాజరు శాతం, అంగన్వాడీకి సంబంధించిన యాప్ నిర్వహించే విధానంపై అంగన్వాడీ కార్యకర్త బి.విశాలాక్షిని ప్రశ్నించారు. పిల్లల ఆటలు, పాటలు పరిశీలించి పలు విషయాలు తెలుసుకున్నారు. పిల్లలను జాగ్రత్తగా తీసుకువచ్చి తిరిగి ఇంటి వద్ద దింపాలని అంగన్వాడీ హెల్పర్ సుజాతను ఆదేశించారు.

శక్తి మొబైల్ యాప్ మహిళల భద్రతకు భరోసా

గుడివాడ, మార్చి 19(ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం, పోలీస్‌శాఖ మహిళల భద్రతకు పెద్ద పీట వేస్తోందని, దీనిలో భాగంగా ప్రత్యేకంగా శక్తి మొబైల్ యాప్‌ను రూపొందించారని వన్ టౌన్ సీఐ కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రూపొందించిన శక్తి(ఎస్.వో.ఎస్) మొబైల్ యాప్‌ను ప్రతి మహిళా తమ మొబైల్ ఫోన్‌లో తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకుని, రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన కోరారు. మొబైల్ ఫోన్‌లో శక్తియాప్ నిక్షిప్తమై ఉంటే ఆపద సమయాల్లో పోలీసుల సహాయం సులువుగా పొందవచ్చని సీఐ తెలిపారు.

పదోతరగతి పరీక్షా కేంద్రాల పరిశీలన

పెదపారుపూడి : పదోతరగతి పరీక్షల నేపథ్యంలో బుధవారం సెకండ్ లాంగ్వేజ్ హిందీ పరీక్ష జరిగింది. మండలంలోని రెండు పరీక్షా కేంద్రాల్లో మొత్తం 204 మంది విద్యార్థులకు 203 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని మండల ఎంఈవో -2 సురేష్ తెలియజేశారు. మండల ఎస్సై ప్రవీణ్ కుమార్ రెడ్డి పదో తరగతి పరీక్షా కేంద్రాలను పరిశీలించారు.

కూచిపూడి: పదోతరగతి పరీక్షల్లో పెడసనగల్లు కేంద్రం నుంచి బుధవారం ఇద్దరు విద్యార్థులు గైర్హాజరయ్యారు. 533 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా, 531 మంది హాజరయ్యారు. కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ పరీక్షా కేంద్రాలను ఫ్లయింగ్ స్క్వాడ్ బృందంతో పాటు ఎంఈవో శ్రీలక్ష్మి పరిశీలించారు.

యథేచ్ఛగా కేబుల్‌వైర్ల చోరీ

● చెలరేగిన మోటార్ల కేబుల్ వైర్ల దొంగలు

● పెట్టీ కేసులతో వదిలేసిన పోలీసులు

తోట్లవల్లూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చాగంటిపాడు, కళ్లంవారిపాలెం, పెనమకూరు గ్రామాల పరిధిలోని మాగాణి పొలాల్లో మంగళవారం అర్ధరాత్రి వ్యవసాయ మోటార్ల వద్ద కేబుల్ వైర్లను దొంగలు కత్తిరించుకుపోయారు. బుధవారం ఉదయం పొలాలకు వెళ్లిన రైతులు మోటార్ల వద్ద కేబుల్ వైర్లు కత్తిరించుకుపోయిన విషయాన్ని గమనించారు. సుమారు 50 మంది రైతులకు చెందిన మోటార్ల వద్ద కేబుల్ వైర్లు కత్తిరించేశారని రైతు కళ్లం వెంకటేశ్వరరెడ్డి చెప్పారు. దొంగలు పొలాల్లోని మోటారు కేబుల్ వైర్లు కత్తిరించి, ఆ వైర్లను కాల్చి అందులోని రాగిని అమ్ముకోవటమే పనిగా పెట్టుకున్నారు. మోటార్ల కేబుల్ వైర్ల చోరీపై రైతులు ఫోన్ ద్వారా తమకు సమాచారమిచ్చారని ఎస్సై సీహెచ్ అవినాష్ తెలిపారు.

ట్రాన్స్‌ఫార్మర్ దొంగలపై పెట్టీ కేసులా..

గతంలో నాలుగు ప్రదేశాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్లను దొంగలు పగులకొట్టి రాగివైర్లు చోరీ చేసిన ఘటనపై మండల విద్యుత్ ఏఈ దేవదాసు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులకు ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టి రాగివైర్లు చోరీ చేసిన దొంగల ఆచూకీ చాలారోజుల వరకు లభించలేదు. వైసీపీ హయాంలో ఐలూరులోని కుంతీదేవి ఉత్సవాల్లో స్థానికేతరులు మద్యం సేవించి గొడవకు దిగారు. దీంతో స్థానికులు నలుగురు యువకులను పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. వారి బైకుల్లో కట్టర్లు, బ్లేడ్‌లు, కరెంటు షాక్ తగలకుండా చేతులకు వేసుకునే గ్లౌజ్‌లు తదితర సామగ్రి ఉండటాన్ని పోలీసులు గమనించి స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను పగులకొట్టింది తామేనని ఆ యువకులు అంగీకరించారు. వారు తోట్లవల్లూరు గ్రామస్థులేనని తేలింది. ఆ యువకులు వైసీపీ సానుభూతిపరులుగా తేలటంతో వైసీపీకి చెందిన ఓ ప్రజాప్రతినిధి జోక్యం చేసుకుని గట్టి సెక్షన్‌లు లేకుండా నామమాత్రంగా పెట్టీకేసు పెట్టేవిధంగా పోలీసులపై ఒత్తిడి తెచ్చారని ఆరోపణలున్నాయి. దీంతో ఆ దొంగలపై పెట్టీ కేసు నమోదు చేసి స్టేషన్ బెయిల్ ఇచ్చి వెంటనే విడుదల చేశారు. ఆ యువకులు విజయవాడలో రాగివైరుని అమ్మినట్టుగా గుర్తించారు. ప్రభుత్వ ఆస్తి అయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను పగులకొట్టి రాగివైర్లు చోరీ చేసి తీవ్ర నష్టం కలిగించిన దొంగలపై కేసు పెట్టి స్టేషన్ బెయిల్ ఇవ్వటంపై నాడు పోలీసులపై తీవ్ర విమర్శలు వచ్చాయి.



కత్తిరించుకుపోయిన సర్వీసు వైరు

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	110, 119, 130
చికెన్ విత్ స్కిన్	210
చికెన్ స్కిన్‌లెస్	220



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 435

26న పెడనలో ఆశీల వేలం పాట

పెడన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పెడన మునిసిపల్ మార్కెట్లలో రోజువారీ రుసుం వసూలు చేసుకునే హక్కుకు ఈ నెల 26వ తేదీ ఉదయం 11 గంటలకు పురపాలక సంఘ కార్యాలయ ఆవరణలో బహిరంగ వేలం నిర్వహిస్తామని కమిషనర్ ఎం. గోపాలరావు తెలిపారు. ఈ వేలానికి సంబంధించి లీజు ధరావత్తు రూ.2 లక్షలుగాను, సాల్వెన్సీ విలువ రూ. 10 లక్షలుగా నిర్ణయించా మన్నారు. మునిసిపాలిటీకి పన్ను, ఇతర బకాయిలు ఉన్న వారు వేలంలో పాల్గొనడానికి అనర్హులని ఆయన స్పష్టం చేశారు. ఆస్తికి సంబంధించిన సాల్వెన్సీ ఎవరి పేరుతో ఉంటే వారు మాత్రమే వేలంలో పాల్గొనేందుకు అర్హులని పేర్కొన్నారు.

నత్తనడకన గోడౌన్ నిర్మాణం

- నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభం
- నాబార్డు నుంచి రూ.40 లక్షలు కేటాయింపు
- నేటికీ పూర్తికాని ధాన్యం గోడౌన్
- నాణ్యతాప్రమాణాలపై ఉన్నతాధికారులకు ఫిర్యాదులు
- ఆట స్థలానికి ఇచ్చిన భూమిలో గోడౌన్ నిర్మిస్తున్నారని స్థల దాత వారసుల ఆరోపణ



మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): రైతుల అవసరాలు తీర్చేందుకు సీతారామపురం పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఎస్ఎన్ గొల్లపాలెం సచివాలయం పక్కన చేపట్టిన ధాన్యం గోడౌన్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. నాబార్డు నిధులు రూ.40 లక్షలతో నాలుగేళ్ల కిందట పనులు ప్రారంభించారు. నేటి వరకు పూర్తి చేయలేదు. దీనిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. కాంట్రాక్టర్ నాణ్యతగా పనులు చేయలేదని ఉన్నతాధికారులకు ఫిర్యాదు అందాయి. కాగా, తమ పూర్వీకులు పాఠశాల ఆటస్థలానికి ఇచ్చిన స్థలంలో గిడ్డంగులు నిర్మిస్తున్నారంటూ గ్రామానికి చెందిన సోదగాని రామకృష్ణ సరికొత్త అభియోగం చేశారు. ఆనాడు రెవెన్యూ అధికారులు సహకార సంఘానికి, మార్కెట్ యార్డుకు అప్పగించిన స్థలంలో గిడ్డంగి నిర్మాణం చేపట్టామని సహకార సంఘ ప్రతినిధులు, అధికారులు తమ వాదనలు వినిపించారు. ఇలా గిడ్డంగి నిర్మాణం పూర్తయ్యేందుకు పలు అవరోధాలు ఎదురవుతున్నాయి. దీంతో ప్రజాధనం వృథా అవుతోందన్న ఆరోపణలు గ్రామంలో వినిపిస్తున్నాయి. అధికారులు సయోధ్యతో అటు స్థలదాతలతోను, ఇటు కాంట్రాక్టర్‌తోనూ సమాలోచనలు జరిపి సరైన నిర్ణయం తీసుకోవలసి ఉంది. మాకు చెప్పకుండా పాఠశాల ఆటస్థలానికిచ్చిన స్థలంలో భవనాలు నిర్మించారని, ఇప్పటికీ సోదగాని రామకృష్ణ తన వాదనను వినిపిస్తూనే ఉన్నారు.

'చేనేత' హామీల అమలుపై హర్షం

గూడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): చేనేతలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్న ముఖ్యమంత్రి ఎన్.చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్, ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు రాష్ట్ర దేవాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి పడవల మోహన్ త్రినాథ్ బుధవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు చేనేత కార్మికుల ఇళ్లకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్‌కు కేబినెట్ ఆమోదం తెలపడంపై హర్షం వ్యక్తం చేశారు.

వేలము నోటీసు

కృష్ణాజిల్లా అఫీషియల్ రిసీవరు, మచిలీపట్నము వారి కోర్టులో

ORIP No:9/2024 - ASCIP No: 4/2022

పై నెంబరు గల IP కేసులో ఇన్‌సాల్వెంట్ అయిన యక్కటి రాజేష్, తాలూకా ఈ దిగువ షెడ్యూలు పై కోర్టు వారిచే పై కోర్టు నందు ది.16-04-2025 మధ్యాహ్నము 12.00 గంటల నుండి వేలము వేయబడును. కావున కావలసినవారు పాటలో పాల్గొని సదరు ఆస్తిని పాడుకొనవచ్చును. పాడుకొన్నవారు పాటలో 1/4 వంతు వెంటనే చెల్లించవలయును. మిగిలిన మొత్తము 15 రోజులలోపు చెల్లించవలెను. **షెడ్యూలు:** అవనిగడ్డ సబ్ రిజిస్ట్రారు, కోడూరు మండలము, ఉల్లిపాలేము గ్రామము - పంచాయితీ పరిధి నందు గల సర్వే నెంబరు.377-6లోని ఎ.2-42 సెంట్లు శేరీపల్లము భూమి మరియు దానికి గల **హద్దులు: తూర్పు:** విస్సంశెట్టి వీరబాబు గారి భూమి, **దక్షిణము:** విస్సంశెట్టి వీరబాబు గారి భూమి, **పడమర:** విస్సంశెట్టి వెంకట రమణ గారి భూమి, **ఉత్తరము:** మీ తాలూకా భూమి. అవనిగడ్డ సబ్‌రిజిస్ట్రారు వారి రికార్డుల ప్రకారము షెడ్యూలు ఆస్తి ఎకరము రూ.8,00,000-00.

అప్‌సెట్ రేటు: రూ.8,00,000-00

గమనిక: వివరములకు కృష్ణాజిల్లా అఫీషియల్ రిసీవరు, మచిలీపట్నము ఆఫీసు నందు పనివేళలలో తెలుసుకొనవచ్చును.

Y.U.S.V.V. SUBBARAO
OFFICIAL RECIVER KRISHNA, MACHILIPATNAM

మామిడిలో సమగ్ర సస్యరక్షణ చర్యలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఉద్యాన శాఖాధికారి రమేష్

అవనిగడ్డ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మామిడి తోటల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని అవనిగడ్డ ఉద్యాన అధికారి ఎన్.రమేష్ సూచించారు. పాత ఎడ్లంక గ్రామంలో మామిడి తోటలను పరిశీలించి పురుగులు, తెగుళ్ల నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. నిమ్మకాయ సైజు దాటిన మామిడి పిందెలకు కవర్లు తొడగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో వీఏఏ తనూజ, వీహెచ్ఏ సౌమ్య పాల్గొన్నారు.

వసుమట్లలో పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

అవనిగడ్డ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పులిగడ్డ శివారు వసుమట్లలో పైపులైన్‌కు బుధవారం మరమ్మతులు నిర్వహించారు. ఇటీవల పైపులైన్ దెబ్బతిని నీటి సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న సర్పంచ్ దాసరి విజయ్ కుమార్ పైపులైన్‌కు మరమ్మతులు చేయించి నీటి సరఫరాను పునరుద్ధరించారు.

రూ. 2 లక్షల ఆర్వోప్లాంట్ వితరణ



ఆలయ అధికారులకు ఆర్వో ప్లాంట్‌ను అప్పగిస్తున్న దాతలు

మోపిదేవి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మోపిదేవిలోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి పల్నాడు జిల్లా నాదెండ్ల గ్రామానికి చెందిన తేళ్ల విక్రమాదిత్య, సహస్ర, శ్రీ విద్య రూ.2 లక్షల విలువైన ఆర్వో ప్లాంట్‌ను ఆలయ ఈవో దాసరి శ్రీరామ వరప్రసాదరావుకు బుధవారం అందజేశారు. కుటుంబసమేతంగా స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ అధికారులు దాతలతో కలసి ఆర్వో ప్లాంట్‌ను అన్నదానశాల నందు ఏర్పాటు చేశారు.

పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత



పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పెడనరూరల్, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): పరిసరాల పరిశుభ్రత మన బాధ్యత అని నందిగామ సర్పంచి బొడ్డు చినబాబు అన్నారు. ఆరోగ్య సిబ్బంది, పారిశుధ్య కార్మికుల తో కలిసి ఇంటింటికి తిరిగి తడి, పొడి చెత్తను వేర్వేరు డబ్బాల్లో ఉంచాలని ప్లాస్టిక్ డబ్బాలను పంపిణీ చేశారు. చెత్త నుంచి సంపద సృష్టించేందుకు సహకరించాలని కోరారు.

జనరిక్ దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం

కోడూరు, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): జనరిక్ మందుల దుకాణాల ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఓబీఎంఎంఎస్ పోర్టల్ ద్వారా రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు మంజూరు చేయుటకు ఆసక్తి గల బీసీ, ఓసీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో సుధా ప్రవీణ్ బుధ వారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు 21 ఏళ్లు నిండి ఉండాలని, రేషన్ కార్డు బీపీఎల్ కార్డు అయి ఉండాలని, కోడూరు మండల పరిధిలోని గ్రామాల్లో నివాసి అయి ఉండాలని, కుల ధ్రువీకరణ పత్రం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ నెల 22లోపు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

బాలికల స్వీయ రక్షణకు కరాటే దోహదం



బాలికలకు శిక్షణ ఇస్తున్న కోచ్

ఘంటసాల, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): బాలికల స్వీయ రక్షణకు కరాటే దోహదపడు తుందని హెచ్ఎం తమ్మన వేణు గోపాలరావు అన్నారు. గోగినేని పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాలికలకు కరాటే శిక్షణ బుధవారం ప్రారంభించారు. హెచ్ఎం మాట్లాడుతూ సమాజం లో నేడు బాలికలు ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యల నుంచి తమనుతాము రక్షించుకోవాలని చెప్పారు. ఈ నెలాఖరు వరకు కరాటే శిక్షణ కొనసాగుతుందని తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధికి సమన్వయంతో కృషి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో సుబ్బారావు

ఘంటసాల, మార్చి 19 (ఆంధ్ర జ్యోతి): మహిళల ఆర్థికాభివృద్ధి సమన్వయంతో కృషి చేయాలని ఎంపీడీవో సుబ్బారావు అన్నారు. బుధవారం స్థానిక వెలుగు కార్యాలయం సమావేశ మందిరంలో పలు శాఖల సమన్వయ కమిటీ సమావేశం జరిగింది. ఎంపీడీవో మాట్లాడుతూ వెలుగు పథకం ద్వారా ఇస్తున్న రుణాలను డ్వాక్రా మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వం మహిళలకు ఇస్తున్న రాయితీలపై అవగాహన కల్పించాలని చెప్పారు. ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఉచిత టైలరింగ్ శిక్షణను ఉపయోగించుకోవాలని కోరారు. ఏవో కె.మురళీకృష్ణ వ్యవసాయ శాఖ ద్వారా అందుబాటులో ఉన్న పథకాలు, రాయితీపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఏపీఎం టి.శ్రీనివాసరావు, సీసీలు జానకి, నాగేశ్వరమ్మ, నరసమ్మ పాల్గొన్నారు.

విషపు ఎర తయారీపై అవగాహన



విషపు ఎర తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు, కళాశాల విద్యార్థినులు

మోపిదేవి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): పంటలను నష్టపరిచే ఎలుకలను నివారించుటలో ప్రముఖ పాత్ర పోషించే విషపు ఎర తయారీపై బాపట్ల వ్యవసాయ కళాశాల విద్యార్థులు కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తల బృందం ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. మోపిదేవి పంచాయతీ శివారు రావివారిపాలెం గ్రామంలో కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి మాట్లాడుతూ ఎలుకలను ఆయకట్టులోని రైతులందరూ సామూహికంగా నివారించటం ద్వారానే నిర్మూలించగల్గుతారన్నారు. నివారణలో భాగంలో బ్రోమోడయోలిన్ విషపు ఎర తయారు చేయటం, పాటించాల్సిన సూచనలను రైతులకు ప్రదర్శనా పూర్వకంగా తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

చేనేతకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలి

పెడన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : చేనేతకు బడ్జెట్‌లో కేటాయింపులు పెంచాలని ఏపీ చేనేత కార్మిక సంఘం కృష్ణాజిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసా గంగాధరరావు, గోరు రాజులు డిమాండ్ చేశారు. ప్రతి బడ్జెట్‌లోనూ చేనేతకు అరకొర నిధులనే కేటాయిస్తున్నారని వారు ఆరోపించారు. నేతన్న నేస్తం పథకాన్ని పునరుద్ధరించి అర్హులైన చేనేత కార్మికులందరికీ వర్తింపచేయాలని కోరారు.

గోశాలకు విరాళం

పెడన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో నిర్మించనున్న గోశాలకు బంటుమిల్లి రోడ్డులోని కోత మిషన్ సెంటర్‌లోని శ్రీవిఘ్నేశ్వర ఆలయ కమిటీ సభ్యులు హిందూ బంధువుల ఐక్యవేదిక ఆధ్వర్యంలో రూ.10,116 విరాళం ఇచ్చారు. ఈ విరాళాన్ని వారు బుధవారం గోశాల నిర్మాణ కమిటీ సారథి నాదెళ్ల కోటికి అందించారు.

టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఎంపీడీవో జి.సుధాప్రవీణ్

నాగాయలంక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సహకార ఆర్థిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వెనుకబడిన వివిధ సామాజిక వర్గాలకు చెందిన 18-50 వయస్సు గల మహిళలకు టైలరింగ్‌పై శిక్షణ ఇచ్చేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ తెలిపారు. బీసీ 40, కాపు 10, ఈబీసీ 10, కమ్మ 28, రెడ్డి 8, క్షత్రియ 1, ఆర్యవైశ్య 8, బ్రాహ్మణ సామాజిక వర్గంలో ఆరు గురికి అవకాశం ఉందని పేర్కొ న్నారు. ఆసక్తి ఉండి అర్హత గల మహిళలు ఈ నెల 22 సాయంత్రం లోపుగా ఆయా సచివాలయాల్లో గానీ, నేరుగా ఎంపీడీవో కార్యాలయంలో దరఖాస్తు అందజేయవచ్చునని తెలిపారు. పూర్తి వివరాలకు సచివాలయాల్లో సంప్రదించాలని కోరారు.

పంట కాలువ పనుల పరిశీలన



అవనిగడ్డ రూరల్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): అశ్వారావుపాలెం వద్ద జరుగుతున్న పంట కాలువ తవ్వకం పనులను అశ్వారావుపాలెం నీటి సంఘం అధ్యక్షులు దాసినేని శ్రీనివాసరావు, వైస్ చైర్మన్ రేపల్లె వెంకటేశ్వరరావు బుధవారం పరిశీలించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ఆధ్వర్యంలో అవనిగడ్డ, నాగాయలంక, కోడూరు మండలాల్లోని 16 పంట కాలువల పూడికతీత పనులకు స్టేట్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ నుంచి రూ.39.90 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈఈ పులిగడ్డ వెంకటేశ్వరరావు, ఏఈఈ పొన్నూరు రవితేజ తదితరులు పాల్గొన్నారు.

పది పరీక్షా కేంద్రం తనిఖీ



మోపిదేవి, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పదవ తరగతి పరీక్షా కేంద్రాన్ని రాష్ట్ర పరిశీలకులు ఎస్.కృష్ణమోహన్ బుధవారం పరిశీలించారు. ఎన్టీఆర్, కృష్ణాజిల్లాల్లో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో జనసేన నాయకుడి మృతి



శ్రీనివాస్(ఫైల్)

గూడూరు/పెడన, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : పెడన పట్టణంలోని బైపాస్‌రోడ్డు సమీపంలో బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరు మండలం లేళ్లగరువు పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, జనసేన నాయకుడు రాయపురెడ్డి శ్రీనివాస్ (50) మృతి చెందారు. పెడన పట్టణంలోని పల్లోటి స్కూల్ సమీపంలో ఉన్న తన చేపల చెరువు వద్దకు వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. శ్రీనివాస్ మృతికి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూరగడ్డ వేదవ్యాస్, డీసీ చైర్మన్ పోతన స్వామి, ఎంపీపీ సంగా మధుసూదనరావు, జడ్పీటీసీ వేముల సురేష్ రంగబాబు, ఎంపీటీసీ జక్కా ధర్మారాయుడు, వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గొరిపర్తి రవికుమార్, కారుమంచి కామేశ్వరరావు, పర్సం పెదబాబు, ఎంపీటీసీ, సర్పంచ్‌లు సంతాపం ప్రకటించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని..



నరసింహారావు (ఫైల్)

గూడూరు : మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారిపై మంగళవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో గూడూరుకు చెందిన లంకపల్లి నరసింహారావు (64) మృతిచెందాడు. పోలీసుల కథనం ప్రకారం.. నరసింహారావు పొలం పనులకు వెళ్లి రోడ్డుపై నడిచి వస్తుండగా పెట్రోల్ బంకు సమీపంలో గుర్తు తెలియని వాహనం ఢీకొంది. వెంటనే క్షతగాత్రుడిని మచిలీపట్నం, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రులకు, ఆ తర్వాత గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతు నరసింహారావును అదేరోజు రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య శాంతకుమారి ఫిర్యాదు మేరకు గూడూరు ఎస్ఐ కె.ఎన్.వి. సత్యనారాయణ కేసు నమోదు చేశారు. ఏఎస్ఐ శామ్యూల్ గుంటూరులో శవ పంచనామా నిర్వహించి పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

22న వారపు సంత, ఆశీల పాట

నాగాయలంక, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): నాగాయలంక గ్రామ పంచాయతీలో 2025-26 సంవత్సరానికి వారపు సంత, రోజువారీ ఆశీల పాటలను ఈ నెల 22వ తేదీ ఉదయం 11.00 గంటలకు కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి జె.పవన్ కుమార్ తెలిపారు. ఆసక్తి గల వారు పాల్గొనాలని ఆయన కోరారు.

అంగన్‌వాడీల్లో ఒంటిపూట బడులు

మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి) : ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకుని అంగన్‌వాడీ కేంద్రాలకు ఒంటిపూట బడులు నిర్వహిస్తున్నట్లు ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎన్.రాణి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు పిల్లలకు ప్రీ స్కూల్ నిర్వహించాలని, మధ్యాహ్నం భోజనం సదుపాయం కల్పించాలని అంగన్‌వాడీలకు సూచించారు.

క్యాన్సర్ రోగికి ఆర్థిక సాయం



క్యాన్సర్ బాధితుడికి ఆర్థిక సాయం అందిస్తున్న మైత్రి ఫౌండేషన్ ప్రతినిధులు

మచిలీపట్నం టౌన్, మార్చి 19 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌తో బాధపడుతున్న మచిలీపట్నం ముస్తాఖాన్‌పేటకు చెందిన బి.వెంకటేశ్వరరావుకు మైత్రి ఫౌండేషన్ సభ్యులు శ్రవణం శివ తదితరులు రూ.5వేల ఆర్థిక సాయం బుధవారం అందించారు. బాధితుడిని ప్రభుత్వం ఆదుకోవాలని మైత్రి ఫౌండేషన్ అధ్యక్షుడు వేణుకుమార్ కోరారు.